ఆంధ్రజ్యోతి



బాపట్ల జిల్లా వార్తలు

5

శనివారం 1 ఫిబ్రవరి 2025





● గుంటూరులోని కొరిటెపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిస్థితి

రిజిస్ట్రేషన్లకు.. రద్దీ

● కిటకిటలాడిన కార్యాలయాలు ● నేటి నుంచి భూములకు కొత్త ధరలు

● చార్జీల సవరణతో ఎగబడిన కొనుగోలుదారులు ● ఒత్తిడి తట్టుకోలేక పలు దఫాలు మొరాయించిన సర్వర్లు

(బాపట్ల, అద్దంకి - ఆంధ్రజ్యోతి)

నూతనంగా పెరి గిన మార్కెట్ ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి. 29న అమావాస్య. దీంతో గురు, శుక్రవారాలు రిజిస్ట్రేషన్లకు జనం పోటెత్తారు. రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారితో రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. రాష్ట్ర ప్రభుత్వం శనివారం(ఫిబ్రవరి 1) నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచనున్నట్లు ప్రకటించింది. దీంతో స్థిరాస్తులు కొనుగోలు, అమ్మకాలు చేసిన క్రయ విక్రయదారులు గురు, శుక్ర వారాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు కార్యాలయాల వద్ద బారులు తీరారు. రెండు, మూడు రోజులు క్రితమే ఆయా దస్తావేజులు సిద్ధం చేసుకున్నప్పటికీ బుధ, గురు వారాలు అమావాస్యకావడంతో ఆయా రోజుల్లో పెద్దగా రిజిస్ట్రేషన్స్



బాపట్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సందడి

జరగలేదు. ఈ నేపథ్యంలో ముందుగానే దస్తావేజులు సిద్ధం చేసుకున్న వారంతా శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కట్టారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వేలాది దస్తావేజులు సబ్ రిజిస్ట్రార్‌ల టేబుళ్ళ మీదకు వచ్చాయి. మొత్తం మీద ఒక్కరోజులోనే ప్రభుత్వ ఖజానాకు కోట్లలో ఆదాయం సమకూరింది. అదే సమయంలో ఒక్కరోజు ముందు రిజిస్ట్రేషన్స్ చేసుకోవడం ద్వారా ఆయా కక్షిదారులు కొంతమేర అదనపు భారం నుంచి తప్పించుకోగలి గారు. కొన్ని ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాత్రి 10 గంటల వరకు కూడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరిగింది. పాత రిజిస్ట్రేషన్ చార్జీలకు చివరి రోజు కావడంతో శుక్రవారం జనం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కట్టారు. ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కా ర్యాలయాల్లో సందడి నెల కొంది. సాధారణంగా అయితే శుక్రవారం రిజిస్ట్రేషన్లు పేలవంగా ఉంటాయి. అయితే శనివారం నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి రానుండడంతో పాటు శుక్రవారం నెలపొడుపు కావడంతో శుభసూచకం అనే ఉద్దేశంతో కక్షిదారులు చివరి రోజు వరకు వేచి ఉన్నారు. దీంతో పెద్దసంఖ్యలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు దస్తావేజులు రావడంతో అధికారులు, సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తలమునకలయ్యారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు కొన్ని పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు రాత్రి వరకు కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరగడంతో సర్వర్లపై ఒత్తిడి పెరిగి పలు దఫాలు మొరాయించాయి. ఫలితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు విఘాతం కలిగింది. గుంటూరు కలెక్టరేట్‌లోని ప్రధాన కార్యాలయంలో, కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రాత్రి వరకూ రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ కొనసాగింది. ప్రధాన కార్యాలయంలో 220 దస్తావేజులు, కొరిటెపాడు కార్యాలయంలో 100 వరకు రిజిస్ట్రేషన్స్ జరిగాయి. రేపల్లె, బాపట్ల, అద్దంకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రాత్రి వరకు రద్దీ ఎక్కువగా కనిపించింది. అద్దంకిలో సరాసరిన రోజుకు 25 నుంచి 30 రిజస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే శుక్రవారం 110 వరకు జరిగాయి. నరసరావుపేటలో రాత్రి 7 గంటలకు 200 పైగా రిజిస్ట్రేన్లు జరిగినట్టు అధికారులు తెలిపారు. నరసరావుపేటతో పాటు సత్తెనపల్లి, క్రోసూరు తదితర ప్రాంతాల్లో రాత్రి కూడా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గురువారం నరసరావుపేటలో దాదాపు 227 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.



అద్దంకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో వేచి ఉన్న క్రయ, విక్రయదారులు

రియాల్టీపై చార్జీల ప్రభావం


ఇప్పటికే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలతో పాటు ప్రధాన పట్టణ ప్రాంతాల్లో దాదాపు 10 నుంచి 20 శాతం మేర చార్జీలు పెరిగాయి. సత్తెనపల్లి వంటి కొన్ని పట్టణాల్లో చార్జీలు దాదాపు రెట్టింపయ్యాయి. మిగిలిన పట్టణ ప్రాంతాల్లో వ్యాపార, వాణిజ్య కూడళ్లలో మాత్రం కొంతమేర ఎక్కువగానే పెరిగాయి. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కొంత కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో రిజిస్ట్రేషన్స్ చార్జీలు వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై కొంత మేర ప్రభావం చూపుతుందని ఆయా వర్గాలు అంటున్నాయి. అంతేగాక పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా వాణిజ్య ప్రాంతాల్లో మార్కెట్ విలువలు భారీగా పెంచడం వల్ల ప్రజావసరాలకు ప్రభుత్వం భూములు సేకరించాల్సిన తరుణంలో ప్రభుత్వంపై భారం పడే అవకాశం ఉంది.

..వరాలిచ్చేనా?

అమరావతి అభివృద్ధి.. తీర ప్రాంతంలో పర్యాటకం పరుగులు.. రైల్వే ప్రాజెక్టులతో పాటు ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలకు అడుగులు.. కేంద్ర పథకాలతో ముడిపడి ఉన్న వివిధ కార్యక్రమాలకు నిధులు.. ఇవన్నీ కేంద్ర బడ్జెట్‌తో ముడిపడి ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో శనివారం కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ తన బడ్జెట్ ద్వారా ఇచ్చే వరాల కోసం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాజధాని అమరావతి బాధ్యత తమదేనని కేంద్రం ప్రకటించింది. అదేవిధంగా కేంద్రం మంజూరు చేసే నిధులపై ఆధారపడి మూడు జిల్లాల పరిధిలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఏ మేర ఆయా ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు ఉంటోందని ప్రజలు బడ్జెట్‌పై ఆశక్తి చూపుతున్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో అమృత్ పథకం ద్వారా రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం చేయూత ఇవ్వాలని రాజధాని వాసులు కోరుకుంటున్నారు. ఇక పేద, మధ్యతరగతి వర్గాల ఆశలు ఏమేరకు ఆర్థిక మంత్రి నెరవేరుస్తారో మరికొన్ని గంటల్లో తేలిపోనున్నది.

కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల ఆశ

● నిధుల కేటాయింపుల కోసం ఎదురుచూపు



● మౌలిక సదుపాయాలకు తోడ్పాటు ఉంటుందా?

● ఆర్‌వోబీలు, ఆర్‌యూబీ నిర్మాణాలకు అడుగులు పడేనా

● తీరప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి నిధుల్లో వాటా ఉండేనా

● నిధులు కేటాయిస్తే అమరావతి రాజధాని నిర్మాణం పరుగులే

బాపట్ల, గుంటూరు జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కేంద్రమైన గుంటూరు.. సుధీర తీర ప్రాంతంతో అలరారుతున్న బాపట్ల.. అభివృద్ధి కోసం ఎదురుచూస్తోన్న పల్నాడు జిల్లాలపై కేంద్రం కరుణించేనా అన్న విషయం మరికొన్ని గంటల్లో తేలనున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ శనివారం ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నిధుల కేటాయింపులపై జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వివిధ ప్రాజెక్టులకు ఎన్నెన్ని నిధులు వస్తాయోనని ఉత్కంఠ నెలకొంది. ఇక సామాన్య ప్రజలు మాత్రం నిత్యావసర సరుకుల ధరలు తగ్గాలని కోరుకుంటున్నారు. ఈ బడ్జెట్‌లో సుంకాలు తగ్గితే కొంతమేరకు ధరలు దిగి వస్తాయని మధ్య తరగతి వాసులు ఆశిస్తున్నారు. ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇస్తే మిర్చి ధరలు పెరుగుతాయని మిర్చి రైతులు కోరుకుంటున్నారు.

● రైల్వే ప్రాజెక్టుల విషయానికి వస్తే నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గం నిర్మాణ దశలో ఉన్నది. గత ఏడాది రూ.310 కోట్లు కేటాయించినా అందులో మూలధనం రూ.60 కోట్లు మాత్రమే. మిగతా రూ.250 కోట్లు ఎస్. ఫండ్ రూపంలో

మిగతా 8వ పేజీలో)



● అమరావతి నూతన రైలు మార్గం (106 కిలోమీటర్లు) ప్రాజెక్టు వ్యయం రూ.2679.59 కోట్లు కాగా రూ.50 కోట్ల మూలధనం ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం భూసేకరణ దశలో ఉన్నది. ఈ బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా మంజూరు చేస్తే త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడానికి అవకాశం కలుగుతుంది.

అమరావతి ఆశలు

కేంద్ర ప్రభుత్వం శనివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నవ్యాంధ్ర ప్రజల కలల రాజధాని అమరావతిపై ఎన్నో ఆశలు రేపుతోంది. గత బడ్జెట్లో రూ.15 వేల కోట్ల సహాయం ప్రకటించి అమరావతికి ప్రాణం పోసిన కేంద్రం ఈసారి అమరావతి అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేలా కేటాయింపులు ఉంటాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలన తాలూకు ఇబ్బందులు, ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడి నవనగర నిర్మాణం పరుగులు తీయాలంటే కేంద్రం చేయూత ఎంతో అవసరమన్నది అటు కేంద్రం, ఇటు రాష్ట్రం భావిస్తున్న నేపథ్యంలో బడ్జెట్ కేటాయింపులపైనే అందరి చూపులు ఉన్నాయి. అమరావతికి మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ, సివిల్ వర్కులతో సహా మొత్తం ఖర్చంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తానని ఇప్పటికే హామీ ఇచ్చింది. దాదాపుగా అలైన్‌మెంటు పూర్తి కాగా రూ.16,310 కోట్లు కేంద్రమే భరించనుంది. ఈ పరిస్థితుల్లో ఇందుకు సంబంధించి బడ్జెట్లో కొంత మేర నిధుల కేటాయింపు ఉండవచ్చని భావిస్తున్నారు. విజయవాడ తూర్పు బైపాస్‌కు కేంద్ర నో చెప్పినందున ఐఆర్ఆర్ విషయంలో తోడ్పాటును ఇవ్వాలన్న డిమాండ్ బలంగా ఉంది. 2014- 19 మధ్య మెట్రో ప్రతిపాదనలు తెరపైకి రాగా 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ ఊసే లేదు. కూటమి ప్రభుత్వం అధికారం లో ఉన్న నేపథ్యంలో ఈసారి కేంద్ర బడ్జెట్లో మెట్రో ప్రస్తావన ఉంటుందన్న ఆశతో రాష్ట్ర ప్రజలు ఉన్నారు. అదే విధంగా అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తే బాగుంటుందని పలువురు భావిస్తున్నారు. గతంలో అమృత్ పథకం కింద కేంద్రం అమరావతికి కొంతమేర చేయూత నిచ్చింది. వైసీపీ హయాంలో ఆ ప్రస్తావనే లేకుండాపోయింది.

మిర్చియార్డు కార్యదర్శిగా చంద్రిక

● బాధ్యతల స్వీకారం.. అధికారుల అభినందనలు ● మిర్చి రైతుల శ్రేయస్సుకే ప్రాధాన్యమన్న చంద్రిక

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డు(వ్యవసాయ మార్కెట్ కమిటీ) ఉన్నత శ్రేణి కార్యదర్శిగా చంద్రిక బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం యార్డు పరిపాలన భవనానికి వచ్చిన ఆమె చార్జి తీసుకుని ఫైలుపై సంతకం చేశారు. ఈ సందర్భంగా పలువురు సెక్రటరీలు, సిబ్బంది ఆమెకు పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. గ్రేటర్ విశాఖపట్టణానికి చెందిన చంద్రిక 2012 గ్రూపు-1 ద్వారా మున్సిపల్ పరిపాలన శాఖలో గ్రేడ్-2 కమిషనర్‌గా ప్రభుత్వ సర్వీసులోకి వచ్చారు. ఆ తర్వాత గ్రేడ్-1, స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతులు పొందారు. తొలి పోస్టింగ్ బొబ్బిలి మున్సిపాలిటీలో కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఆ తర్వాత మచిలీపట్నం, బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. గత ఏడాది నుంచి ఆమె డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించేందుకు ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆమె విజ్ఞప్తిని పరిశీలించిన సీఎం చంద్రబాబు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తాజాగా గుంటూరు మిర్చి యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా డిప్యూటేషన్‌పై పోస్టింగ్ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చియార్డుకు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పదవి తనకు ఒక సవాలు లాంటిదని, అందరి సహాయ, సహకారాలు తీసుకుని రైతులు, మార్కెట్ కమిటీ శ్రేయస్సు కోసం కష్టపడి పని చేస్తానన్నారు. ప్రస్తుతం మిర్చి సీజన్ ఉచ్ఛదశలో ఉందని, కచ్చితంగా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ యార్డు కార్యకలాపాలు సజావుగా, సాఫీగా జరిగేలా చర్యలు చేపడతానన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రాధాన్యమిచ్చి కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పారు. అనంతరం సెక్రటరి చంద్రిక మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత చుట్టుగుంటలోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత కమిషనరేట్ అధికారులు, జాయింట్ కలెక్టర్, మిర్చియార్డు పర్సన్ ఇన్‌చార్జి అమిలినేని భార్గవతేజని మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా చంద్రికను కలిసి యార్డు కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, జయరామిరెడ్డి, ఆంజనేయులు, అధికారులు నరేంద్ర, రాఘవరావు, వేమెన్ అసోసియేషన్ల నాయకులు అభినందనలు తెలిపారు.



చంద్రిక



రేపే కానుకమాత తిరునాళ్ల

దూరవిద్య బీఎల్ఐఎస్సీ ఫలితాలు విడుదల

పతన సంస్కృతిపై పోరాడుదాం

● ఏపీపీఎల్‌సీఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిబాబు

6

క్రీడలతో ఒత్తిడి దూరం

● మానసిక ప్రశాంతతకు దోహదం ● పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో ఏఎస్పీ విరలేశ్వర్

బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఒత్తిడిని దూరం చేయవచ్చని ఏఎస్పీ టీపీ విరలేశ్వర్ తెలిపారు. జిల్లా వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను శుక్రవారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్ మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానిసక ప్రశాంతతకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. తొలుత బాపట్ల, చీరాల, రేపల్లె సబ్ డివిజన్ల ఆర్మడ్ రిజర్వు పోలీసు అధికారులు, సిబ్బంది మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం క్రీడాకారులతో స్పోర్ట్స్‌మీట్ ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్పీ జెండా ఊపి పురుషుల 100 మీటర్ల పరుగుపందెంను ప్రారంభించారు. మూడురోజులపాటు క్రీడాపోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు మోయిన్, రామాంజనేయులు, శ్రీనివాసరావు, జగదీష్‌నాయక్, పి.విజయసారథి తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఏఎస్పీ టీపీ విరలేశ్వర్

రహదారులకు.. రూ. 5,266 కోట్లు



విస్తరించనున్న దుర్గి - వెల్దుర్తి రహదారి



గోతులు మయంగా కొండమోడు రహదారి

◆ కేంద్రం నిధులతో రోడ్లకు మహర్దశ ◆ పలు రోడ్లు నాలుగు వరసలుగా విస్తరణ ◆ ఇప్పటికే కొన్ని ప్రారంభం.. మరికొన్ని వేగవంతం ◆ రాష్ట్ర రహదారులు.. జాతీయ రహదారులుగా అభివృద్ధి

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలోరూ.5,266 కోట్లు మంజూరుతో జిల్లా లోని రోడ్లకు మహర్దశ పట్టనుంది. రెండేళ్లలో రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చి అభివృద్ధి చేస్తోంది. కేంద్ర రహదారి మౌలిక సదుపాయల పథకం కింద జిల్లాలోని పలు రోడ్లకు ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయి. ఆయా రోడ్ల విస్తరణతో అటు బాపట్ల, ప్రకాశం ఇటు గుంటూరు జిల్లాలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. రహదారులు వినియోగంలోకి వస్తే ప్రజా రవాణా వేగవంతమవుతోంది. ఇప్పటికే రెండు జాతీయ రహదారుల పనులు పూర్తయ్యాయి. నాగార్జున సాగర్- దావులపల్లి జాతీయ రహదారిని రూ.230 కోట్లతో 47 కిలోమీటర్ల మేర రెండు వరుసలుగా విస్తరించారు. ఇటీవల ప్రధాని మోదీ దీనిని ప్రారంభించిన విషయం తెలిసిందే.

భారత్ మాలా ప్రాజెక్టులో..

కొండమోడు-పేరేచర్ల 167 ఏజీ జాతీయ రహదారి విస్తరణకు రూ.881.61 కోట్లు మంజూరయ్యాయి. భారత్ మాలా ప్రాజెక్టు కింద పనులు చేపడుతున్నారు. 49.917 కిలోమీటర్లు నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తారు. సత్తెనపల్లి, మేడికొండూరులో బైపాస్ ఏర్పాటు చేయనున్నారు. టెండర్ల ప్రక్రియ కొలిక్కిరాగా భూసేకరణ దాదాపు పూర్తయింది. పనులకు ప్రధాని మోదీ ఇటీవల విశాఖ పర్యటనలో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన విషయం తెలిసిందే.

రెండు ప్యాకేజీల్లో 167ఏ రహదారి..

కేంద్ర ఉపరితల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఓడరేవు - పొందుగల 167ఏ జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. బాపట్ల జిల్లా ఓడరేవు నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డరోడ్డు వరకు నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. 85 కిలోమీటర్లు పొడవున రూ.1,064 కోట్లతో రహదారి నిర్మాణం జరుగుతుంది. ఓడరేవు నుంచి చిలకలూరిపేట వరకు రూ.678 కోట్లతో 47 కిలో మీటర్లు రహదారి పనులను ప్యాకేజీ ఒకటి కింద చేపట్టారు. చిలకలూరిపేట నుంచి అడ్డరోడ్డు వరకు 38 కిలోమీటర్లలో పనులను రెండో ప్యాకేజీలో చేపట్టారు. మొదటి ప్యాకేజీలో పనులు వేగవంతం కాగా రెండో ప్యాకేజీలో పనులు టెండరు, భూసేకరణ దశలో ఉన్నాయి.



బొప్పూడి వద్ద ఓడరేవు రహదారి విస్తరణ పనులు

వినుకొండ నుంచి పేరేచర్ల వరకు

వినుకొండ నుంచి గుంటూరు జాతీయ రహదారి 544డీ విస్తరించేందుకు కేంద్రం నిధులు (మిగతా 6వ పేజీలో)

వర్క్‌షాపు బ్రోచర్ ఆవిష్కరణ



వర్క్‌షాప్ కరపత్రాలు విడుదల చేస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు, ఇతర అధికారులు

పెదకాకాని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్య కళాశాల ఆధ్వర్యంలో యోగ యాజ్ ఏ థెరపీటిక్ ఇంటర్వెన్షన్ అనే అంశంపై రెండు రోజుల యూజీసీ జాతీయ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు వర్క్‌షాప్ డైరెక్టర్, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.జాన్సన్ తెలిపారు. ఫిబ్రవరి 12, 13 తేదీల్లో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు వర్క్‌షాపు బ్రోచర్‌లను ఆవిష్కరించారు. విభాగం అధ్యాపకులు, యోగ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సూర్యనారాయణ, అధ్యాపకులు డాక్టర్ రామ్మోహనరావు, డాక్టర్ కె.సత్యమూర్తి, సిబ్బంది జె.రాజేష్, ఆనంద్ కిషోర్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విజన్‌పై జాతీయ సదస్సు

పెదకాకాని, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21, 22 తేదీలలో అంబేడ్కర్ విజన్ ఆన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో పొలిటికల్ ఎకనామిక్ ఫాక్టర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్ కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సదస్సు ఫలవంతంగా జరగాలని ఆకాంక్షించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలు పంపాలని సూచించారు. ఫిబ్రవరి 15వ తేదీలోగా పరిశోధకులు, అధ్యాపకులు, మేధావులు తమ పరిశోధన పత్రాలను పంపాలని కోరారు. సదస్సు కోశాధికారి డాక్టర్ కె.అబ్రహాం లింకన్, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, విభాగం పరిశోధకులు, సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య బీఎల్ఐఎస్‌సీ ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు

పెదకాకాని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్రం గత అక్టోబరు, నవంబరు నెలలో నిర్వహించిన బీఎల్ఐఎస్ సీ కోర్సు మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ విడుదల చేశారు. ఈ ఫలితాలను దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని తెలిపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, కోదండపాణి, ఉద్యోగులు టంకశాల వెంకటేశ్వర్లు, ఎల్ఎస్.రాంబాబు, కంప్యూటర్ సెక్షన్ నిర్వాహకులు వలి తదితరులు పాల్గొన్నారు.

పతన సంస్కృతిపై పోరాడుదాం

- ఏఐపీఎల్‌సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు
- ఘనంగా అఖిల భారత ప్రజా సాహిత్య, కళా సాంస్కృతిక సభలు ప్రారంభం



మాట్లాడుతున్న కొత్తపల్లి రవిబాబు, పాల్గొన్న సాహితీ వేత్తలు

గుంటూరు (తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): అణిచివేత రాజకీయ పాలనకు, సనాతనం పేరుతో హీన, బానిస భావ, పతన సంస్కృతిని ప్రోత్సహిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా భావ సారూప్య ప్రజాస్వామ్య శక్తులతో ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించడానికి సమయం ఆసన్నమైందని ఆల్ ఇండియా పీపుల్స్ లిటరేచర్ అండ్ కల్చరల్ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించే అఖిల భారత ప్రజాసాహిత్య, కళా సాంస్కృతిక సభలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సభకు జాతీయ ఉపాధ్యక్షుడు దివి కుమార్ స్వాగతం పలుకుగా ఏఐపీఎల్‌సీఎఫ్ నాయకులు రమణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. 'పీపుల్స్ లిటరేచర్' 11 సంచికను ఆవిష్కరించి జాతీయ ప్రధాన కార్యదర్శి రవిబాబు కీలక ఉపన్యాసం చేస్తూ ప్రపంచీకరణ నేపథ్యంలో ముంచుకొస్తున్న ఆర్థిక, సామాజిక, సాహిత్య, కళా, సాంస్కృతిక దోపిడీలకు వ్యతిరేకంగా పీడిత ప్రజల గొంతుకగా అఖిల భారత ప్రజా సాహిత్య సాంస్కృతిక వేదిక బలమైన ప్రత్యామ్నాయ సంస్థగా కృషి చేస్తుందని వివరించారు. సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, సీఎస్ఆర్ ప్రసాద్, కాట్రగడ్డ దయానంద్, గౌతమ్ ముఖర్జీ, సుగధన్ పాల్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆదివాసి చిన్నారులు ప్రదర్శించిన 'బుడతల బుర్రకథ, శ్రీకాకుళోద్యమ గిరిజన పోరాట చరిత్రపై ప్రదర్శించిన 'పోరు దారి' ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని జన సాహితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. అరుణ పర్యవేక్షించగా, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిత్రకళ ప్రదర్శనను ప్రముఖ చిత్రకారుడు టి.వెంకట్రావు ప్రారంభించారు.

'కూటమి' అండగా నిలవాలి

- ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు



మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాదు, పక్కన తిరుపతిరావు, వల్లూరి జయప్రకాష్

గుంటూరు(తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అండగా నిలిచి భారీ విజయం చేకూర్చాలని కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు విజ్ఞప్తి చేశారు. స్థానిక లాలుపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్ర ప్రసాదు మాట్లాడుతూ గత ఏడు నెలలుగా చేస్తున్న అభివృద్ధిని కొనసాగిస్తామని అన్నారు. గత ఐదేళ్లలో మండలిలో జరిగిన పరిణామాలు చూస్తే తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తామని అన్నారు. కూటమిలో ఉన్న నాయకులను కలుపుకుని ముందుకు వెళ్తానని తెలిపారు. చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ఆలపాటి గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. నేషనల్ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ చదువుకున్న మేధావులను ఎన్నుకుని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ మిత్రపక్షంగా ఉన్న టీడీపీ, జనసేనతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తూరి వెంకట సుబ్బారావు, ఈదర శ్రీనివాసరెడ్డి, భీమినేని చంద్రశేఖర్, గాజుల వెంకయ్య నాయుడు, శనక్కాయల ఉమాశంకర్, నేరళ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు.. రూ.5,266 కోట్లు


(5వ పేజీ తరువాయి)

మంజూరు చేసింది. అనంతపూర్-గుంటూరు రహదారి విస్తరణలో భాగంగా వినుకొండ నుంచి పేరేచర్ల వరకు ఉన్న రహదారిని నాలుగు వరసలుగా విస్తరిస్తారు. సుమారు 90 కిలోమీటర్ల పొడవునా రహదారిని విస్తరించేందుకు రూ.2,360 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వినుకొండ నుంచి నరసరావుపేట మీదగా రహదారిని విస్తరిస్తారు. రహదారి విస్తరణకు కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. భూసేకరణతో పాటు రహదారి పనులకు ఎన్‌హెచ్ అధికారులు సమాయత్తమవుతున్నారు.

పనులు వేగవంతం.. ప్రారంభం

- దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.312 కోట్లతో 20 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తారు. ఈ పనులకు ఇటీవల మోదీ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. పనులు ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథార్టీ చర్యలు చేపట్టింది.
- దాచేపల్లి మాచర్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారి 167ఏడీగా మార్చారు. రూ.403.22 కోట్లతో పనులు చేపట్టారు. దాచేపల్లి నుంచి గురజాల, రెంటచింతల, పాల్వాయిగేటు మీదగా మాచర్ల వరకు 37 కిలోమీటర్ల పొడవున పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పాల్వాయిగేటు వద్ద రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.
- సత్తెనపల్లి, గురజాల ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లపై బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సత్తెనపల్లి రెడ్డిగూడెం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.57.13 కోట్లు మంజూరు చేసింది. గురజాల నియోజవర్గంలోని తుమ్మలచెరువు - నడికూడి స్టేషన్ల మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.70.49 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు భూసేకరణను వేగవంతం చేశారు.
- మాచర్ల నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.117.75 కోట్లు మంజూరు చేసింది. దుర్గి నుంచి వెల్దుర్తి వరకు 17.6 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ.31.60 కోట్లు మంజూరయ్యాయి. 8/6 కిలోమీటరు వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మిస్తారు. రెంటచింతల మండలం పాలువాయి జంక్షన్ నుంచి పసర్లపాడు, జెట్టిపాలెం మీదగా సత్రశాల వరకు 11.2 కిలోమీటర్ల పొడవున రహదారి విస్తరణకు రూ.21.65 కోట్లు మంజూరయ్యాయి. ఈ రహదారిలో 2/4 కిలో మీటరు వద్ద వాగుపై బ్రిడ్జి మంజూరైంది. మాచర్ల నుంచి విజయపురిసౌత్ వరకు 22.8 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.31 కోట్లు, లోయపల్లి నుంచి గొట్టిపాళ్ల, కండ్లకుంట, గుడిపాటి చెరువు మీదగా లచ్చంబావితండా వరకు 25.40 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.33.50 కోట్లు మంజూరయ్యాయి.

రేపే కానుకమాత తిరునాళ్ల



కానుకమాత ఆలయం

- రూ. 5 కోట్లతో ఆలయం ఆధునికీకరణ

రెంటచింతల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన పురాతన క్రైస్తవ ఆలయాల్లో ఒకటైన రెంటచింతల కానుకమాత దేవాలయం ఆధునికీకరణతో భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. అద్భుతమైన ఆర్కిటెక్ట్ ఇంజనీరింగ్ ప్రమాణాలతో నిర్మించిన గోపురాలు తాపీ పని వారి నైపుణ్యానికి మచ్చుతునకగా ఉన్నాయి. రెంటచింతలలో క్రైస్తవ సంఘం 18వ శతాబ్దంలోనే వెలసినట్లు చరిత్ర చెబుతుంది. 1850లో కానుకమాత చర్చిని కేవలం రూ.4 వేలతో నిర్మించారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన బ్రట్ జేమ్స్ దాసన్ క్రీస్తు ప్రార్థనా మందిరానికి పూనుకున్నారు. ఈ ఆలయంలో భక్తులు కూర్చోడానికి సరిపోకపోవడంతో 1982లో మరో ఆలయాన్ని నిర్మించి ప్రార్థనలు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆ ఆలయాన్నే రూ.5 కోట్లతో పునర్నిర్మించారు.కేవలం రెండు పిల్లర్లతో ఈ ఆలయ నిర్మాణం జరగడం విశేషం. గోపురాలు 50 అడుగులుండగా ప్రధాన గోపురం 100 అడుగుల ఎత్తులో ఉంది. రెంటచింతల అనాదిగా క్రైస్తవ మతానికి ఆలంబనగా ఉంది. ఆధ్యాత్మికతకే పరిమితి కాకుండా విద్యాలయాలు, సాగునీటి కాలువలు అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

భారీ ఎత్తున ఏర్పాట్లు



ఫాదర్ మర్రెడ్డి

ఫిబ్రవరి 2న కానుకమాత దేవాలయం 175వ తిరునాళ్లను ఘనంగా జరపడానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫాదర్ వైఎల్ మర్రెడ్డి చెప్పారు. 1వ తేదీ 20 వేల మందికి అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం జరిగే తిరునాళ్లకు ముఖ్యఅతిథులుగా బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య, కడప పాలనాధికారి బిషప్ గాలిబాలి, నల్గొండకు చెందిన గోవిందు జోజి తదితర పీఠాధిపతులు రానున్నారు. ఈ నెల 24న జెండా ప్రతిష్ఠతో తిరునాళ్ల ఉత్సవాలు ఆరంభమయ్యాయి. 21 సంవత్సరాల తరువాత ఎడ్ల పోటీలు ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఎక్కడ చూసినా తిరునాళ్ల వాతావరణమే కన్పిస్తుంది.

బాపట్ల ఎడ్ల జతకు ప్రథమ బహుమతి



బండలాగుడు ఎడ్ల పోటీలను తిలకిస్తున్న ప్రజలు

రెంటచింతల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కానుకమాత 175 తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం న్యూ క్యాటగిరీ ఒంగోలు జాతి బండలాగుడు ఎడ్ల పోటీలను నిర్వహించారు. అత్తోట శిరీషా చౌదరి,శివకృష్ణ చౌదరి (వేటపాలెం, బాపట్ల జిల్లా) ఎడ్ల జత 3900.9 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి, వజ్రాల వెంకటేశ్వరరెడ్డి (సంతమాగులూరు, బాపట్ల జిల్లా) ఎడ్ల జత 3900 దూరం లాగి రెండో బహుమతి, తనుబొద్ది రవిశంకర్‌రెడ్డి(ఉప్పుమాగులూరు, బాపట్ల జిల్లా)ఎడ్ల జత 3300 అడుగుల దూరం లాగి మూడో బహుమతి, డాక్టర్ హుస్సేన్(కోదాడ)పిన్నెబోయిన అభిషేక్ యాదవ్ (రెంటాల, రెంటచింతల మండలం)కంబైన్డ్ ఎడ్ల జత 3287.8 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతి, కొలుసు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు (గన్నవరం,కృష్ణాజిల్లా) ఎడ్ల జత 3135 అడుగుల దూరం లాగి ఐదో బహుమతి, ఎర్రం రాజశేఖర్ యశ్వంత్ (దొండపాడు, నరసరావుపేట)2889.6 అడుగుల దూరం లాగి ఆరో బహుమతిని కైవసం చేసుకున్నాయి. మొత్తం 10 ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొనగా 9 జతల వరకు బహుమతులు, 1 జతకు కన్సోలేషన్ బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులైన వైఎల్ మర్రెడ్డి, సుమంత్‌రెడ్డి, అల్లం ప్రతాపరెడ్డి, రాయపరెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, శౌర్రెడ్డి, రామకృష్ణ, జోసఫ్ రెడ్డి, ఆదిరెడ్డి, మర్రెడ్డి పాల్గొన్నారు.

కారు, స్కూటర్ ఢీకొని ఒకరు మృతి

నకరికల్లు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దేచవరం రోడ్డు వద్ద కారు, స్కూటర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచర్లకు చెందిన షేక్ జిలానీ(30) స్కూటర్‌పై మాచర్ల వైపు వెళ్తుండగా నకరికల్లు మండలం దేచవరం అడ్డరోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనటంతో జిలానీకి తీవ్ర రక్త స్రావం అయింది. సమాచారం అందుకున్న 108 పైలెట్ భాస్కర్, ఈఎంటీ వెంకటేష్ జిలానీని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు జిలానీ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ హయాంలోనే...
ఎన్జీరంగా వర్సిటీలో అక్రమాలు

- రాజకీయ ఒత్తిడితో జరిగిన బదిలీలు రద్దు
- డబ్బులిచ్చి పదవిలో ఉండాల్సిన అవసరం లేదు
- 'ఆంధ్రజ్యోతి'తో వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి



గుంటూరు సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు రైస్ బౌల్ (ఆహారపు గిన్నె) అని పేరు రావటంలో ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీది కీలక పాత్ర!. ఈనాటికీ రాష్ట్రంతో పాటు, దేశంలోని అనేక రాష్ట్రాలు కడుపునిండా అన్నం తింటున్నాయంటే దానికి వెనుక వర్సిటీ శాస్త్రజ్ఞుల శ్రమ, కృషి ఎంతో ఉందని చెప్పడంలో అతిశయోక్తిలేదు. ఆరు దశాబ్దాల పరిశోధన యాత్రలో హరితవిప్లవానికి బాటలు వేసిన యూనివర్సిటీ రాశి, వాసి గురించి ఎంత చెప్పినా తక్కువే! అటువంటి యూనివర్సిటీ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజకీయాలకు వేదికైంది. ప్రభుత్వం మారిన తర్వాత వీసీ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రస్తుత వీసీ శారదా జయలక్ష్మిపై పలు ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత వీసీ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీ 'ఆంధ్రజ్యోతి' తో ప్రత్యేకంగా మాట్లాడారు. గడచిన ఐదేళ్ల కాలంలో అక్కడ జరిగిన అనేక విషయాలను వివరించారు.

● సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో జరిగిన అక్రమాలు?

వీసీ: 2021 లో జరిగిన సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో 2016లో సవరించిన ఉత్తర్వులు పాటించలేదు. అప్పుడు కూడా 2006నాటి నిబంధనలే పాటించటం వల్ల కొందరికి ప్రమోషన్లు దక్కలేదు. అప్పుడు విష్ణువర్ధన్ రెడ్డి వీసీ గా ఉన్నారు. నేను వీసీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2022లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి డిపార్ట్మెంటల్ కమిటీ, స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేసి పారదర్శకంగానే ప్రమోషన్లు ఇచ్చాం. జీఓ 20 ప్రకారం జరిగిన ప్రమోషన్లలో అక్రమాలకు తావులేదు.

● బదిలీల వ్యవహారంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు?

వీసీ : వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు జరిగిన బదిలీల్లో రాజకీయ ఒత్తిళ్లు ఉన్న మాట నిజమే. నేను రాకముందే అక్రమ బదిలీలు జరిగాయి. దానికి పాత వీసీ ఉన్నప్పుడే బీజం పడింది. అప్పుడే తిరుపతి వ్యవసాయ కళాశాలలో ఎక్కువ మందిని నియమించారు. ఇక్కడ(లాం) ఉన్న చాలామంది అర్హులైన సైంటిస్టులను అకారణంగా చాలా దూరానికి బదిలీ చేశారు. వాళ్లకు అక్కడ మూడేళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత కూడా ఇక్కడికి రాకుండా అడ్డుకున్నారు. ఇవన్నీ గతంలో జరిగినవే. నేను వీసీగా బాధ్యతలు తీసుకున్నాక ఆ తప్పిదాలను, అక్రమాలను సరిచేసే బాధ్యతను తీసుకున్నాను. అర్హులైన వారు ఎవరైతే ఉన్నారో వాళ్లను తిరిగి లాంకు తెచ్చాను. కేంద్రం జీతాలు చెల్లించే కళాశాలలో అవసరమైన సిబ్బందిని నియమించాను.

● మీ పైన కూడా వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చారా?

వీసీ: బదిలీల విషయంలో మా మీద ఎంత ఒత్తిడి తీసుకువస్తారో చెప్పలేను. ఉదాహరణకు ఒక ఉదంతం చెబుతాను. లాం మెయిన్ ఆఫీసులో ఉన్న ఒక ఉద్యోగిని లాంలోనే ఉన్న మరో చోటికి బదిలీ చేశాను. వైసీపీకి చెందిన ఒక ముఖ్య నేత ఉదయాన్నే ఫోన్ చేసి ఆ ఉద్యోగిని ఉన్న చోటే ఉంచమని ఒత్తిడి తెచ్చారు. దాని కోసం ఒక మంత్రి.. ఇంకా చాలామంది ఫోన్ చేశారు. చాలా సందర్భాల్లో రాజకీయ నేతలు చెప్పిన బదిలీలు చేయక తప్పని పరిస్థితి.

● 2024 ఎన్నికలకు ముందు జరిగిన అక్రమ బదిలీలపై చర్యలు ఏమిటి?

వీసీ: అప్పట్లో రాజకీయ ఒత్తిడితో జరిగిన ప్రతి బదిలీనీ రద్దు చేయాలని నిర్ణయించాం. డిప్యూటేషన్‌పై ఉండే అదనపు సిబ్బందిని వారి ఒరిజినల్ ప్రదేశానికి పంపిస్తాం. ఎవరు ఎక్కడ జీతం తీసుకుంటున్నారో అక్కడికే వెళ్లిపోయేలా చర్యలు చేపడతాం.

● ప్రస్తుతం ఉన్న పదవిలో కొనసాగే విషయం?

వీసీ: ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారు. అన్ని అర్హతలూ ఉన్నాయి కాబట్టే నన్ను ఈ పదవికి ఎంపిక చేశారు. అప్పట్లో సీనియారిటీ లిస్టు పంపేటప్పుడు కేవలం విష్ణువర్ధన్ రెడ్డి ఒక్కరి పేరు మాత్రమే పంపారు. ఆ లిస్టు చూసి అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొత్తం పది మంది పేర్లతో సీనియారిటీ జాబితా పంపమని చెప్పారు. ఆ జాబితా ప్రకారం నాకు అవకాశం వచ్చింది. అది ఎన్ని రోజులుంటే అన్ని రోజులు కొనసాగుతాను. డబ్బులిచ్చి ఈ పదవిలో కొనసాగాల్సిన అవసరం లేదు.

● నిధుల దుర్వినియోగంపై ఏమంటారు?

వీసీ: యూనివర్సిటీకి సంబంధించిన నిధుల ఖర్చు, కేటాయింపుల వ్యవహారంలో వీసీ పాత్ర ఏమీ ఉండదు. సంబంధిత విభాగాధిపతులు అన్ని ఫైళ్లూ పరిశీలించి నాదగ్గరకు పంపుతారు. వాటిని చూసి ఆమోద ముద్ర వేయటమే నా పని. ఎక్కడా నగదు వ్యవహారం ఉండదు. అంతా ఆన్‌లైన్ చెల్లింపులే. మెయిన్ బిల్డింగ్ నిర్మాణం అంతా ప్రభుత్వం, ఏపీఐఐసీకి మధ్యే జరుగుతుంది. అందులో వర్సిటీ ప్రమేయం, పాత్ర ఏమీ ఉండదు.

ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న లారీ

- ఒకరు మృతి



మృతి చెందిన గణేష్

రొంపిచర్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిచెట్టుపాలెం వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని ఉప్పల్ చిలకానగర్‌కు చెందిన పొన్నం గణేష్(33) ఐషర్ వాహనంలో హైదరాబాద్ నుంచి ప్రకాశం జిల్లాలోని చేపల చెరువుకు కోళ్లకు చెందిన వ్యర్థాలను తీసుకు వెళ్తున్నాడు. మర్రిచెట్టుపాలెంలోని కాలనీ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గణేష్ మృతి చెందాడు. వాహనం ముందు భాగం బాగా దెబ్బతింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ మణికృష్ణ సందర్శించారు. మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 552.30 అడుగులు ఉంది. ఇది 214.87 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 2684 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7436, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,165 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 41,765 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119.127.137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

70,952 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 61,331 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 70,952 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 58,781 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	14500	334	8500	13000
నెంబరు. 5	9000	13000	నెంబరు.5	--	--
273	7500	14000	273	--	--
341	8000	15000	341	10000	11000
4884	9000	12500	4884	--	--
సూపర్ 10	8000	13500	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7000	14500	తేజ	7500	14000
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	9500	12000
దేవనూరు డీలక్స్	8000	13000	దేవనూరు డీలక్స్	10000	11500
తెల్లకాయలు	4000	10000	తెల్లకాయలు	4500	8500

ధర్మరక్షణ కోసం ధర్మనిధి సభ్యులుగా చేరండి

బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ధర్మ రక్షణ కోసం ధర్మనిధి సభ్యులుగా చేరండని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర సహసంయోజక్ కొండూరు ఈశ్వరయ్య అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశాన్ని శుక్రవారంపెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో మండల కమిటీ విస్తృత సమావేశాలు నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 8న సత్సంగం నిర్వహించాలని 8, 24వ తేదీలలో ఏకాదశి నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. 12వ తేదీ మార్గ పౌర్ణమిని పురస్కరించుకొని అన్ని దేవాలయాలలో సామూహిక హారతులు నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి వెంకటేశ్వర్లు, రాయపూడి అంకమ్మచౌదరి, మోదడుగు సూరిబాబు, చిల్లా సత్యనారాయణ, ధర్మప్రచారక్‌లు జంజనం హేమశంకరరావు, చింతల మురళి కృష్ణ, అక్కల సుబ్బారెడ్డి, దండుప్రోలు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా

బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో వేగేశన ఫౌండేషన్ వారు శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. సూర్యలంకరోడ్డులోని టౌన్‌హాలు పరిసరాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు బాపట్ల పరిసరప్రాంతాలు నుంచి నిరుద్యోగయువత పెద్దఎత్తున తరలివచ్చారు. 50 కంపెనీలకు చెందిన ప్రతినిధులు దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. ఆయా కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సంగం డెయిరీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కర్లపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కర్లపాలెం ఉప సర్పంచ్, అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌బాషా తెలిపారు. అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం లంక ఛానల్ కట్టపై ఉంటున్న 10 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీటీసీ కట్టా సుజాత, షేక్ బహదూర్ బాషా, షేక్ ఇబ్రహీం, షేక్ హబీబ్, షేక్ జిలాని, ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులు ప్రారంభం

భట్టిప్రోలు, (కొల్లూరు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దేవీశరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభించినట్లు అల్లం వెంకటేశ్వరరావు తెలిపారు. భట్టిప్రోలు శ్రీబాలాత్రిపురసుందరి సమేత హేమవితలేశ్వరస్వామి దేవస్థానంలో ఉన్న శ్యామలాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను ఫిబ్రవరి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు రాత్రి 7 గంటల నుంచి 8.30 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 4న రథసప్తమి సందర్భంగా సూర్యగాయత్రి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలాత్రిపురసుందరి మహిళా సమాజం నిర్వహణలో పూజాది కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశానికి తరలి రావాలి

భట్టిప్రోలు, కొల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వేమూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి తరలిరావాలని కొల్లూరు, భట్టిప్రోలు టీడీపీ నాయకులు మైనేని మురళీకృష్ణ, తూనుగుంట్ల సాయిబాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం తెనాలి నన్నపనేని వెంకట్రావు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను కార్యకర్తలకు ఎమ్మెల్యే వివరించనున్నారని తెలిపారు.

రేపు వేమూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

వేమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : లైఫ్ హాస్పటల్, ధన్వంతరీ హెల్త్ కేర్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వేమూరులోని శ్రీ వివేకానంద విద్యావిహార్ భవనంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో గుండె జబ్బులు, నరాల బలహీనత, షుగర్ వ్యాధిగ్రస్తులు, సాధారణ వ్యాధుల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, కొలెస్ట్రాల్, షుగర్ తదితర పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వేమూరు, పరిసర గ్రామాలలోని అనారోగ్యం కలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మినుము పంటలో తెగుళ్ల నివారణకు సూచనలు

నగరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : నగరం మండలం చిన్నమట్లపూడి గ్రామంలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు మినుము పంటకు క్షేత్రసందర్శనను నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలమురళీధర్‌నాయక్, డాక్టర్ ఉషా తదితరులు పాల్గొన్నారు. క్షేత్ర సందర్శనలో మినుము పంటలో పల్లాకు తెగులును ఆశించినట్లు గుర్తించారు. దీని నివారణకు వ్యాధి సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలన్నారు. దీంతోపాటు తెల్లదోమ, తామర పురుగు, పేను బంక నివారణకు తగు మందులను సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.నాగశ్రీనివాసరావు, ఎంపీఈవో గంగాపార్వతి, నీటిసంఘం అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్, టీడీపీ సీనియర్ నాయకుడు మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్



బాపట్లలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలగాలి

● మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : మహిళల కోసం ఆత్మార్పణ చేసుకున్న కన్యకాపరమేశ్వరి దేవిని పూజిస్తే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పాతపట్నంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలిగితే ఆకుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయన్నారు. ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారన్నారు. ఆర్యవైశ్యులకు ఎలాంటి చిన్న ఇబ్బంది వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని, ఆర్యవైశ్యులకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ మేకా వెంకటశివరామకృష్ణ, ఆర్యవైశ్య నాయకులు ఆలపాటి వేణు, తడికమళ్ళ వేణు, వేమూరి వెంకటేశ్వరరావు, తూనుగుంట్ల పాండురంగారావు, టీకేవీ గుప్తా, కాశేపల్లి ఈశ్వరరావు, పొన్నూరి గౌరీ రామకుమారి, మద్ది పద్మజ, తాతా ఏడుకొండలు, గుర్రం మురహరిరావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, కొమ్మూరి వెంకటేష్, పంతాని సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


బాపట్లలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం ఆత్మార్పణ మహోత్సవ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరి అమ్మవారి కృపా కటాక్షాలు నియోజకవర్గ ప్రజలపై మెండుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ పట్టణ అధ్యక్షులు వడ్లమూడి వెంకటేశ్వరరావు, బూర్లె రామసుబ్బారావు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం గ్రామంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణం మహోత్సవ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే నరేంద్రవర్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, భక్తులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

14వ వార్డులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొని అక్కడి ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మలేరియా విభాగం, బాపట్ల పట్టణ పురపాలక సంఘం సంయుక్త కార్యాచరణ నిర్వహణలో భాగంగా సంజీవ్‌గాంధీకాలనీ పరిధిలో ఉన్న సచివాలయం, వివేకానందకాలనీకి సంబంధించి 14వ వార్డు హనుమంత్‌నగర్ కాలనీని బాపట్ల మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, జిల్లా మలేరియా అధికారి ఎం.గోపినాథ్ సందర్శించి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డులో ప్రత్యేక పారిశుధ్య పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో, ఇంటి వెలుపల వైపున నీటి నిల్వలు లేకుండా, దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు తెలియపరుస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజధానిని కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలి : సీపీఎం

బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాజధానిని కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలని సీపీఎం నాయకులు వై.నేతాజి అన్నారు. పాతబస్టాండ్ ఆవరణలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి సీపీఎం రాష్ట్ర నాయకులు వై.నేతాజి పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రయోగ రాజధానిని నిర్మించాలని అప్పుల రాజధాని కాదన్నారు. సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదిలలో జరగనున్నాయని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని అభివృద్ధి చేయకుండా మూడు రాజధానులు అని చెప్పి ప్రజలను మోసం చేయటం జరిగిందన్నారు. ప్రజా రాజధానిని నిర్మించకపోతే రాజధాని రైతులు, ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి ఎం.రవి, జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, సీపీఎం రాష్ట్ర నాయకులు బురుగ వెంకటేశ్వర్లు, బాపట్ల జిల్లా నాయకులు పి.కొండయ్య, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, బి.సుబ్బారావు, డి.శ్రీను పాల్గొన్నారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్ చిరస్మరణీయులు : డాక్టర్ జి.చార్వాక

బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజా యుద్ధనౌక గద్దర్ చిరస్మరణీయులని అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక అన్నారు. గద్దర్ 76వ జయంతి కార్యక్రమాన్ని దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దంపతుల విగ్రహాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి చార్వాక ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 5వేల పాటలకు పైగా నాట్యం చేసి మూడు వేల విప్లవపాటలు రచించి దేశంలోనే అత్యున్నత స్థాయిలో వాగ్గేవికారునిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు, కులవివక్షత పోరాటసమితి నాయకులు శరత్, కుమ్మరి శామ్యూల్, కంచర్ల వెంకటగిరి, దాసి నాగేశ్వరరావు, గుదే రాజారావు పాల్గొన్నారు.

అమృతలూరులో...

అమృతలూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ జయంతి శుక్రవారం నిర్వహించారు. స్థానిక శ్రీప్రసన్నాంజనేయస్వామి గుడి సెంటర్‌లో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ పీడిత ప్రజల పక్షాన నిలబడి తన పాటల ద్వారా వారిని చైతన్య పరిచిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. గద్దర్ చిత్రపటానికి గర్నెపూడి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గిరి, కట్టుపల్లి నాగరాజు, షేక్ బురాని, కొండమూరి సుబ్బారావు, అవనిగడ్డ అశోక్, జాషువా, పరిశుద్ధరావు, కట్టుపల్లి సాయిరాం పాల్గొన్నారు.

30 పోలీసు యాక్ట్ అమలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

బాపట్ల రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణ, మండలం, చందోలు, కర్లపాలెం, వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంత ప్రజలకు ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు 30 పోలీసు యాక్ట్‌ను అమలు పర్చటం జరుగుతుందని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా-గుంటూరు జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ సందర్భంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిషేధించడమైనదని తెలిపారు. ఎవరైనా అత్యవసరమైతే సంబంధిత పోలీసు అధికారి దగ్గర మూడు రోజుల ముందుగానే వారి అప్లికేషన్‌ను సమర్పించాలన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి : మేరుగ

బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఫీజు పోరు పోస్టర్లను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అండగా ఉండేందుకు ఫిబ్రవరి 5న వైసీపీ ఫీజు పోరుబాట చేపట్టి ప్రభుత్వ మొండి వైఖరిని విడనాడాలని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మరుప్రోలు కొండలరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వై.సహిత్, పార్టీ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, కొక్కిలగడ్డ చెంచయ్య, చల్లా రామయ్య, మోర్ల సముద్రాల గౌడ్, గంగిశెట్టి రత్తయ్య, గొర్రైముచ్చు వెంకటేశ్వర్లు, జోగి రాజా, తన్నీరు అంకమ్మరావు పాల్గొన్నారు.

బైక్ అపహరించారంటూ ఫిర్యాదు

బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పార్కింగ్ చేసిన బైక్‌ను అపహరించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఉమ్మారెడ్డి సరోజనీ కాలనీకి చెందిన దాసరి శివకోటేశ్వరరావు భీమావారిపాలెంలో టైలర్ షాపునకు వెళ్ళాడు. బైక్ రోడ్డు పక్కనే పార్కు చేసి టైలర్ వద్దకెళ్ళి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేదలకు వైద్యం అందించటం అభినందనీయం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : పేదలకు వైద్యసేవలు అందించటం అభినందనీయమని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక మౌంట్‌ఫోర్టు స్కూల్, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, గుండె, నేత్ర, తదితర వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతోమందికి విద్యబోధన చేస్తూ మౌంట్‌ఫోర్టు స్కూల్, రెడ్‌క్రాస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి రోగులకు మందులు పంపిణీ చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు రెడ్‌క్రాస్‌కు రక్తదానాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ అధ్యక్షుడు డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, వైద్యులు, మౌంట్‌ఫోర్టు స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల పరిశీలన



వేమూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

వేమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో భాగంగా వేమూరు మండల పరిధిలోని వేమూరులో రెండు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. మరుగుదొడ్ల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం తదితర విషయాలపై స్థానిక అధికారులు, ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో తెరుచుకోని రైల్వేగేటు



రైల్వేగేటు తెరుచుకోక ఆగిన ట్రాఫిక్

వేమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రైల్వే గేటు సాంకేతిక లోపంతో గేటు వేసిన తరువాత తెరుచుకోకపోవంతో తెనాలి-కొల్లూరు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. సాయంత్రం 6.30 గంటలకు రేపల్లె నుంచి గుంటూరు వెళ్లే ప్యాసింజర్ రైలుకు గేటు వేశారు. సాంకేతిక లోపం వల్ల గేటు అర్ధగంట పాటు తెరుచుకోకపోవడంతో వందలాది వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. ట్రాఫిక్ నిలిచిపోవడంతో వేమూరు మెయిన్ రోడ్డు రద్దీగా మారి వాహనదారులు, ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురయ్యారు. అనంతరం రైల్వే అధికారులు మరమ్మతులు చేసి గేటును తెరవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ శంకుస్థాపన

బాపట్లరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం భర్తీపూడి-అప్పికట్ల గ్రామ సరిహద్దులలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం గ్రామస్థులు ఎంతో వైభవంగా నిర్వహించారు. మహిళలు, గ్రామస్థులు కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పికట్ల సర్పంచ్ గుత్తికొండ రజనీ రాజేష్, భర్తిపూడి గ్రామ సర్పంచ్ అచంట అమరేష్, కుర్రా దశరథరామయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, ఇనగంటి గాంధీ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి : ఎంపీడీవో



వైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

కర్లపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వైద్యశాలలోని వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రతి రోగిపై వ్యక్తిగత శ్రద్ధ చూపాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ వైద్యశాలను శుక్రవారం ఎంపీడీవో సందర్శించి రికార్డులను తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ వృత్తి అనేది అత్యవసరం కనుక ఎప్పుడు ఎటువంటి రోగి వైద్యశాలకు వస్తారో తెలియదని, అందుకని వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా సమయపాలన పాటించి రోగులను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నాయకులు పెన్షన్ల పంపిణీలో పాల్గొనకూడదు

పిట్టలవానిపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామపంచాయతీలలో ఫిబ్రవరి 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా మండలంలోని కూటమి నాయకులు ఎవరు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనవద్దని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ తెలిపారు.

వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్ఓసీ అందజేత



బాధిత కుటుంబానికి ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్ఓసీని ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు బాధిత కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు. మండలంలోని ఇంటూరు గ్రామానికి చెందిన గుమ్మడి శ్యాంసన్‌కు ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎమ్మెల్యే ద్వారా అర్జీ అందజేశారు. దీంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.లక్ష 391 మంజూరు చేశారు. ఈ ఎల్ఓసీని గుంటూరులోని తన కార్యాలయంలో బాధితుడి కుటుంబసభ్యులకు అందించారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు క్రయ, విక్రయదారుల తాకిడి

● రెండు రోజుల్లో కొల్లూరులో 50, భట్టిప్రోలులో 85 రిజిస్ట్రేషన్లు

భట్టిప్రోలు, కొల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి విలువ పెరుగుతుండటంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు క్రయ, విక్రయదారుల తాకిడి పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీ నుండి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచనున్నట్లు ప్రకటించడంతో స్థిరాస్తులు కొనుగోలు, అమ్మకాలు చేసిన క్రయ, విక్రయదారులు గురు, శుక్ర వారాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు కొల్లూరు, భట్టిప్రోలు రిజిస్ట్రార్ కార్యాలయాలకు పోటెత్తారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. ఫిబ్రవరి 1 నుంచి కొనుగోలు చేసిన స్థిరాస్తులకు 15 శాతం స్టాంపు డ్యూటీ పెంపుదల చేయడంతో ముందస్తుగానే రిజిస్ట్రేషన్లకు కార్యాలయాల వద్ద క్యూ కట్టారు. కొల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 30వ తేదీన 20, 31న 30 రిజిస్ట్రేషన్లు కాగా, భట్టిప్రోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 30వ తేదీన 40, 31న 45 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆయా సబ్ రిజిస్ట్రర్లు ఐ.కోటేశ్వరరావు, జి.రాధాకృష్ణమూర్తి తెలిపారు. 29వ తేదీన అమావాస్య కావడంతో రిజిస్ట్రేషన్లు జరగకపోవడం గమనార్హం.

విశ్రాంత జీవితం ఆనందమయంగా గడపాలి

● టీడీపీ నేత మురళీకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ నేత మురళీకృష్ణ

కొల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు తమ విశ్రాంత జీవితాన్ని ఆనందమయంగా గడపాలని టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ అన్నారు. కొల్లూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత, బాలురోన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న సిహెచ్ ఉషాకుమారి, కె.నాగపాప ఆయా పాఠశాలల్లో శుక్రవారం పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మైనేని ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతాయుతమైనదన్నారు. విద్యార్థులు తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను ఎన్నటికి మరువకూడదని సూచించారు. ఉషాకుమారి, నాగపాప ఉపాధ్యాయులుగా, స్కూల్ అసిస్టెంట్లుగా పని చేసి హెచ్‌ఎంలుగా పాఠశాలల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. హెచ్‌ఎం దంపతులను మురళీకృష్ణతో పాటు పలువురు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. హెచ్‌ఎంలు కూడా మురళీకృష్ణను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో ఎస్ఎంసీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమలులోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి

● రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగింపు



స్తంభాలకు కట్టిన బ్యానర్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

భట్టిప్రోలు, కొల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. మండల కేంద్రాలు భట్టిప్రోలు, కొల్లూరుతో పాటు పలు గ్రామాల్లో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను తొలగిస్తున్నట్లు ఎంపీడీవోలు ఎస్వీ రమణ, కె.నరసింహరావు శుక్రవారం తెలిపారు. మార్చి 3వ తేదీ వరకు ఎలక్షన్ కోడ్ అమలులో ఉంటుందని అప్పటి వరకు రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా ముసుగులు వేయాలని, బ్యానర్లు తొలగించాలన్నారు. కొల్లూరులో పంచాయతీ కార్యదర్శి బి.మల్లికార్జున ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లు స్వచ్ఛందంగా తొలగించాలని లేని పక్షంలో సిబ్బందితో వాటిని తొలగించడం జరుగుతుందన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు ఉద్యోగోన్నతి



పదోన్నతి పొందిన నాగరాజును సత్కరిస్తున్న మురళీమోహన్, వీఆర్వోలు

భట్టిప్రోలు, (కొల్లూరు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న గాదెలవర్తి నాగరాజు తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నాగరాజును ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్, వీఆర్వోలు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డీటీగా భట్టిప్రోలు మండలంలో పని చేస్తున్న సమయంలో అధికారులతో పాటు ప్రజల మన్ననలు కూడా పొందారని అదే విధంగా కారంచేడు మండలంలో కూడా తహసీల్దార్ ప్రజలకు సేవలు అందించి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు శివరామకృష్ణ, కాళికృష్ణ, పుల్లయ్య, జక్కయ్య, సురేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధి గణపతి స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకారాల్లో సిద్ధి, బుద్ధి సమేత సిద్ధిగణపతి స్వామి

భట్టిప్రోలు, (కొల్లూరు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : సిద్ధి, బుద్ధి సమేత సిద్ధిగణపతి స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని వెల్లటూరు సిద్ధిగణపతి ఆలయంలో శుక్రవారం స్వామి వారిని పెళ్లి కుమారునిగా అలంకారం చేశారు. ఫిబ్రవరి 2న స్వామి వారికి అన్నాభిషేకం, కల్యాణం, మూషిక వాహనసేవ, 2న ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన, విశేష వాహన సేవ, 3న గణపతి హోమం, రాత్రి వేళ రథోత్సవం, 4న ధ్వజ అవరోహణం, అనంతరం క్షేత్రపాలకులు ఆదిశేషాచల స్వామి వారి శాంతి కల్యాణం జరుగుతుందని దేవస్థాన అనువంశిక ధర్మకర్తలు తెలిపారు.

సత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

పిట్టలవానిపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీఎస్‌పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శుక్రవారం అన్నంవారి ఇలవేల్పు సత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు అత్యంత ఘనంగా నిర్వహించారు. అనంతరం సత్యమ్మ తల్లికి భక్తులు మొక్కుబడులు తీర్చుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ అధికారంలోకి రాడు..

● ఆయన అడిగింది ఒక్క ఛాన్సే ● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలన అవినీతిమయం కావటంతో అధికారం కోల్పోయింది.. జగన్‌మళ్లీ అధికారంలోకి రాడు ఆయన ప్రజల్ని అడిగింది ఒక్క ఛాన్సే అని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ వ్యాఖ్యానించారు. గుంటూరులో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, మాల, మదిగల మధ్య చిచ్చుపెట్టేందుకు ఎస్సీ వర్గీకరణ అంశం తెరపైకి తెచ్చారని విమర్శించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. వర్గీకరణ కేవలం రిజర్వేషన్‌లకే కాదు అన్నింట్లో ఉండాలన్నారు. సుప్రీంకోర్టు జడ్జీల పోస్టుల్లో వర్గీకరణ కావాలి. లక్షల కోట్లు బ్యాంకుల అప్పుల్లో వర్గీకరణ కావాలి, కాంట్రాక్టుల్లో వర్గీకరణ కావాలన్నారు. సుప్రీంకోర్టు జడ్జీలు 33మంది ఉంటే, అందులో ఒకే సామాజికవర్గం (బ్రాహ్మణులు) 20మంది ఉన్నారని పేర్కొన్నారు. అమరావతి కోర్టులో ఎంతమంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ జడ్జీలున్నారో చెప్పాలని ప్రశ్నించారు. బ్యాంకులను జాతీయం చేసింది కాంగ్రెస్ పార్టీ, ప్రధాని ఇందిరాగాంధీ. కానీ నేడు ఎస్సీలకు, ఎస్టీలకు, ఓబిసీలకు బ్యాంకులు ఇస్తున్న అప్పులు 1 శాతం మాత్రమేనని, మిగిలిన 99శాతం బ్యాంకు అప్పులు ఎవరికిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఒకాయనకు రూ.45వేల కోట్లు అప్పులిచ్చాయి. కానీ ఆ వ్యక్తికి మోడీ సాయం చేసి, రూ.40వేల కోట్ల అప్పులు మాఫీ చేయించాడు. పవర్ ప్రాజెక్టు పేరుతో మళ్లీ ఇంకో రూ.10వేల కోట్లు అప్పు కావాలని అడుగుతున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలో వర్గీకరణ జోలికిపోతే సీఎం చంద్రబాబుకే నష్టమన్నారు. వర్గీకరణ కోసం సీఎం చంద్రబాబు వేసిన మిశ్రా కమిషన్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీఆర్‌డీఏ కాంట్రాక్ట్ పనుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల్లో ఎంతమందికిచ్చారు? ఇక్కడ వర్గీకరణ కావాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో వచ్చే 2029 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఓబీసీని ముఖ్యమంత్రిగా చూడాలన్నదే నా కోరికని తెలిపారు. కేవలం అమరావతి రాజధానిలో వేల కోట్లు ఖర్చుపెట్టటం సరికాదని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభివృద్ధికి వెచ్చించాలన్నారు. జెమిలి ఎన్నికలతో చంద్రబాబుకే నష్టమని స్పష్టం చేశారు.

అట్టహాసంగా విజ్ఞాన్ బాల మహోత్సవ్

● చిన్నారులకు రాష్ట్రస్థాయిలో ఆటల పోటీలు



క్రీడాజ్యోతిని తీసుకువస్తున్న విద్యార్థులు

గుంటూరు(విద్య), జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎల్లప్పుడు ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన విద్యార్థులు ముందుగా "విజ్ఞాన్ బాల మహోత్సవ్ 2కే25"లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ చిన్నారులు మొబైల్ ఫోన్‌ను సాధ్యమైనంత తక్కువగా వినియోగించాలన్నారు. అదేవిధంగా జంక్‌ఫుడ్ తినకుండా సంప్రదాయ వంటలను మాత్రమే తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రౌండ్‌లో ఆటలు ఆడుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ చదువులో బాగా ఫోకస్ చేయాలన్నారు. విద్యార్థులు ఫిజికల్‌గా ఫిట్‌గా ఉన్నట్లైతే మెంటల్‌గా స్ట్రాంగ్‌గా ఉంటారని తెలిపారు. జీవితంలో కష్టపడి పనిచేయడంతో పాటు బాగా కృషి చేసిన వారే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్ అన్నారు. విద్యార్థులు కలల సాకారానికి అంకితభావంతో కృషి చేస్తే ఉన్నతంగా ఎదిగే శక్తి సామర్థ్యాలు మీలో ఉన్నాయన్నారు. క్రీడలు శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడతాయన్నారు. ముందుగా స్పోర్ట్స్ మీట్‌లో బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 100 మీటర్ల రిలే నిర్వహిస్తామన్నారు. బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 100 మీటర్ల రిలే పోటీలు నిర్వహించారు. వీటితో పాటు మ్యూజిక్ (క్లాసికల్ సింగింగ్ సోలో, సింగింగ్ ఐడల్ లిటిల్ చాంప్, గ్రూప్ సింగింగ్, ఇన్‌స్ట్రుమెంట్ సోలో), డాన్స్(క్లాసికల్, వెస్ట్రన్, ఫోక్ గ్రూప్), లిటరరీ (వ్యాసరచన, లెటర్ రైటింగ్, జనరల్ క్విజ్, ఎలక్యూషన్), ఫైన్ ఆర్ట్స్ (స్పాట్ పెయింటింగ్, క్లే మోడలింగ్) పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థుల జోరు



వేడుకలకు భారీగా హాజరైన విద్యార్థినీ విద్యార్థులు



సంగీత పోటీల్లో నువ్వా నేనా అంటూ...



ఖోఖో పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

మహానాడుకు లోకేశ్ రక్ష

● రూ 294 కోట్ల వ్యయంతో కృష్ణానదికి రిటైనింగ్ వాల్

● మహానాడు వాసులకు తప్పనున్న కృష్ణా వరద ముంపు




సీతానగరం వద్ద కృష్ణాతీరం వద్ద వారధి నుంచి ప్రకాశం బ్యారేజి వైపు రిటైనింగ్‌వాల్ నిర్మించనున్న ప్రదేశమిదే

మంగళగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మహానాడు ఏరియా వాసులకు స్థానిక ఎమ్మెల్యే నారా లోకేశ్ అభయహస్తాన్ని అందించారు. తరచుగా వచ్చే కృష్ణానది వరద ముంపునకు గురై నానా అగచాట్లు పడుతూవస్తున్న మహానాడు ప్రాంత ప్రజలను... ఇక ఆ సమస్య నుంచి లోకేశ్ ఒడ్డెక్కిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా వున్న కృష్ణా వరద ముంపు సమస్యను ఎమ్మెల్యే లోకేశ్ శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు చొరవ చూపి నిధుల మంజూరుకు కృషి చేశారు. కొద్ది రోజుల కిందట జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు అయ్యే రూ 294 కోట్ల నిధులను లోకేశ్ మంజూరు చేయించారు. దీంతో మహానాడు వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలను దీర్ఘకాలంగా వేధిస్తున్న పెను సమస్యల పరిష్కారంపై లోకేశ్ దృష్టి పెట్టారు. ఇక ఈ సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావేమోనన్న నిరాశల మధ్య నలిగిపోతున్న ప్రజలకు అదృష్టం లోకేశ్ రూపంలో వచ్చి పడింది. ఆయన ఎమ్మెల్యేగా బాధ్యతలు తీసుకోవడానికి ముందే మంగళగిరి నియోజకవర్గ సమస్యలపై సంపూర్ణమైన అవగాహనను ఏర్పరచుకున్నారు. అందుకే అధికారంలోకి వచ్చిందే తడవుగా ప్రధానమైన పెను సమస్యలపైనే దృష్టిని కేంద్రీకరించారు. మొన్నటికి మొన్న స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రివర్గంచే ఆమోదముద్ర వేయించిన లోకేశ్ మలి సమావేశంలో రూ 53 కోట్ల వ్యయంతో మంగళగిరిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇప్పించారు. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఏకంగా రూ 294 కోట్ల వ్యయంతో సీతానగరం మహానాడు ఏరియాను కృష్ణా వరదముంపు నుంచి తప్పించేందుకు రక్షణగోడను నిర్మించేందుకు తీర్మానం ఆమోదింపజేశారు. ఓ రకంగా చెప్పాలంటే రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగినప్పుడల్లా మంగళగిరి నియోజకవర్గానికి ఏదొక వరం ప్రాప్తించేలా లోకేశ్ కృషి చేస్తున్నారు.

మహానాడు... తెలుగుదేశంపార్టీకి చాలా ముఖ్యమైన కార్యక్రమం. పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జన్మదినం మే 28వ తేదీని పురస్కరించుకుని ప్రతియేటా మే 27 నుంచి 29 వరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్రస్థాయిలో జరుపుకునే ఓ పెద్ద వేడుక. తొలి మహానాడుకు 1983లో విజయవాడ వేదిక కాగా రెండో మహానాడుకు తాడేపల్లి లోని కృష్ణానదీ తీర ప్రాంతమైన సీతానగరం కేంద్రమైంది. నాడు మహానాడు జరుపుకున్న ఆ కృష్ణాతీర ప్రాంత మైదానాన్ని ఆనక పేదల నివాసాల నిమిత్తం ప్రభుత్వం పేదలకు పంచి పెట్టడంతో ఆ ప్రాంతం మహానాడు ఏరియాగా ముద్ర వేసుకుంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సుందరయ్యనగర్, మహానాడు కాలనీల పేరుతో వేలాది జనావాసాలు నిండిపోయాయి. అయితే కృష్ణానదికి అయిదు లక్షల క్యూసెక్కులకు మించి వరద వచ్చినప్పుడల్లా మహానాడు ప్రాంతం వరదముంపునకు గురవుతూ వస్తుంది. ఈ సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలంటే ప్రకాశం బ్యారేజి దిగువన బ్యారేజి నుంచి కనకదుర్గమ్మవారధి వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా కాంక్రీట్ రిటైనింగ్‌వాల్ (రక్షణగోడ)ను నిర్మించాలి. వాస్తవానికి కృష్ణా వరదలకు అటు విజయవాడవైపు కృష్ణలంక కూడా ముంపునకు గురౌతుంది. ఆ సమస్యను పరిష్కరించేందుకు గతంలో విజయవాడ వైపు కూడా కృష్ణాతీరం వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేశారు. ఇపుడు ఇటు గుంటూరు జిల్లా వైపు మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి సీతానగరం కృష్ణాతీరంలో కూడా రిటైనింగ్‌వాల్‌ను నిర్మిస్తే మహానాడు వాసులకు వరద ముంపు సమస్య తప్పుతుంది.

వాస్తవానికి మహానాడు వాసులు ఏనాడు అనుకోని...ఊహించని వరాన్ని లోకేశ్ వారికి ప్రసాదించినట్టే. ముంపు సమస్య పరిష్కారం కావాలంటే రూ వందల కోట్లు కావాల్సిందే. ప్రభుత్వం నుంచి అన్నేసి వందల కోట్లను సాధించి తీసుకొచ్చే వారెవరుంటారులెమ్మని... అక్కడి బాధితులు ఇన్నాళ్లు మౌనంగానే వుండిపోయారు. ఓ రకంగా చెప్పాలంటే... ఏ బాధితుడూ... ఏ రాజకీయపార్టీ కూడా మహానాడు వాసుల ప్రయోజనార్థం కృష్ణాతీరంలో రిటైనింగ్‌వాల్‌ను నిర్మించాలని గొంతెత్తి అడుగలేదు. అయినా.. లోకేశ్ వచ్చాడు.. సమస్యను గమనించాడు...దానికి శాశ్వత పరిష్కారమార్గం వైపు నడుం కట్టాడు. త్వరలోనే సీతానగరం ఏరియాలో రైల్వే బ్రిడ్జి ప్రాంతం 0.9 నుంచి కనకదుర్గమ్మ వారధి 2.9 కి.మీల వరకు అంటే రెండు కిలోమీటర్ల పొడవునా కాంక్రీట్ రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగనుంది. ఈ రక్షణగోడ నిర్మాణంతో వరదల సందర్భంలో కూడా మహానాడు వాసులు ఏ ఆందోళన లేకుండా ప్రశాంతంగా జీవించే రోజులు రాబోతున్నాయి.



మహానాడు ఏరియా



వరదల సందర్భంలో నది నుంచి మహానాడు నివాసాలను ముంచెత్తిన వరదనీరు (ఫైల్‌ఫోటో)

ముగ్గురు మృతి.. ముగ్గురికి గాయాలు

● ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాల ఢీ

● స్నేహితుడి పుట్టిన రోజు కేక్ కోసం వస్తుండగా ఘటన

● గుంటూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం



బలరామ్, డేవిడ్‌రాజు, గోవర్ధన్ మృతదేహాలు

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు సమీపంలోని ఏటుకూరు గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు ఘటనా స్థలంలో మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామానికి చెందిన జూటూరి డేవిడ్ రాజు అలియాస్ దావీదు (18), ఎం గోవర్ధన్(18), నల్లచెరువు బొమ్మల సెంటర్‌కు చెందిన ఎన్ బలరాం(38) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, మృతుల బంధువుల కథనం మేరకు.. కుర్నూతల గ్రామానికి చెందిన డేవిడ్ రాజు, గోవర్ధన్, మనీష్ అనే ముగ్గురు ఒకే ద్విచక్రవాహనంపై కేక్ కొనుగోలుకు గుంటూరు వస్తున్నారు. డేవిడ్ రాజు క్లాస్మేట్ అయిన కొర్నెపాడు గ్రామానికి చెందిన యువకుడి పుట్టిన రోజు కావడంతో కేక్ కొనుగోలుకు గుంటూరు వస్తున్నారు. అదే సమయంలో పర్చూరు వెళ్లే రోడ్డులో రాఘవేంద్ర కాటన్ మిల్‌లో పని చేసే మేస్త్రి ఎన్ బలరాం ద్వి చక్రవాహనంపై మిల్లుకు వెళ్తున్నాడు. ఈయన వద్ద కూలీ పనులు చేసుకునే ఐదో మైలుకు చెందిన రంగమ్మ(45), ఆమె కుమారుడు మల్లికార్జున్(19) గుంటూరు నుంచి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో బలరాం కనిపించడంతో ఆయన ద్విచక్ర వాహనం ఎక్కారు. ఏటుకూరుకు, ఐదో మైలుకు మధ్యన రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకున్నాయి. ఈ ప్రమాదంలో డేవిడ్ రాజు, గోవర్ధన్, బలరాంలు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మనీష్ తలకు గాయం కావడంతో మతిస్థిమితం కోల్పోయినట్లుగా ఉన్నాడు. రంగమ్మకు గాయాలుకాగా ఆమె కుమారుడు మల్లికార్జున్ పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉంది. గాయపడిన ముగ్గురిని జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన నల్లపాడు సీఐ వంశీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం

అతివేగం.. అజాగ్రత్తతో సంభవించిన ప్రమాదంతో మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. డేవిడ్ రాజు ఏసీ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గోవర్ధన్ కప్ బోర్డు వర్క్ చేస్తుంటాడు. గాయపడిన మనీష్ ఇంటర్ చదువుతున్నాడు. వారు హెల్మెట్ పెట్టుకోకపోవడంతోనే ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు.



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న నల్లపాడు సీఐ వంశీధర్

..వరాలిచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

వస్తుందని అంచనా వేశారు.

● గుంతకల్లు - గుంటూరు డబ్లింగ్‌కు గత ఏడాది రూ.480 కోట్లు కేటాయించింది. అయితే దిగువమెట్ట వద్ద రిజర్వు ఫారెస్టులో ఇంకా కొన్ని అనుమతులు రావాల్సి ఉండటంతో పనులు జరగడం లేదు. ఈ కారణంగా అదొక బాటిల్ నెక్‌గా మారింది.

● గుంటూరు-బీబీనగర్(248 కిలోమీటర్ల) రైల్వే డబ్లింగ్‌కి గత ఏడాది రూ.220కోట్ల మూలధనం మంజూరుకావడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇంకా ఎక్కువ మొత్తంలో నిధుల కేటాయింపు జరగాలని రైల్వేవర్గాలు ఆశిస్తున్నాయి. విష్ణుపురం వద్ద బైపాసు లైన్‌కు కూడా నిధుల కేటాయింపు ఎక్కువమొత్తంలో జరగాలని ఆశిస్తున్నారు.

● గుంటూరులో శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి ఇటీవలే రూ.109 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంత మొత్తం కేటాయిస్తారోనన్న ఉత్కంఠ నెలకొన్నది. పలకలూరు రైల్వేగేటు, ఇన్నర్‌రింగురోడ్డు రైల్వేగేటు వద్ద కూడా ఆర్‌వోబీలు మంజూరయ్యాయి. వీటికి కూడా నిధుల కేటాయింపు ఎక్కువమొత్తంలో జరగాలని పలువురు కోరుకుంటున్నారు.

● కేంద్ర ప్రభుత్వ నిధులతో పేరేచర్ల - కొండమోడు నాలుగు వరసల జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్నది. దీనికి ఏమేరకు కేటాయింపులు జరుపుతారోనని అంతా ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

● అనంతపురం - అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకి ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారో, లేదోనన్న అనుమానాలు నెలకొన్నాయి.

● 72 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉన్న బాపట్ల జిల్లాకు పర్యాటకంగా కేంద్రం ఊతమిస్తే ఉపాధిపరంగా వేలసంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుంది. జిల్లా అభివృద్ధికి ఇంధనంగా ఆతిథ్యరంగం మారే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. తొలి అడుగులో సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.93 కోట్ల కేటాయింపులకు కేంద్రం ఇటీవల పచ్చజెండా ఊ పిన సంగతి తెలిసిందే. ఆ నిధులకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపులపై ఉత్కంఠ నెలకొంది.

● నిజాంపట్నం మండలం దిండి తీర ప్రాంతంలో సమీకృత ఆక్వాపార్కు నిర్మాణానికి అదనంగా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.

● బాపట్ల జిల్లాలో 22,000 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుంది. ఇక్కడ నుంచి పెద్ద ఎత్తున రొయ్యలు, చేపలు విదేశాలకు ఎగుమతి అవుతాయి. కేంద్రం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఆక్వా రంగానికి రాయితీల వరాల జల్లు కురిపించడంపై రైతాంగం ఆశతో ఉంది. ఆక్వాపార్కు ప్రాజెక్టు నిర్మాణం వ్యయం పెంచడానికి గతంలోనే కేంద్రం ఆమోద తెలిపింది. రూ.90కోట్ల నుంచి రూ.190కోట్ల వరకు పెంచే ప్రతిపాదనలకు అనుమతిచ్చింది. దీనికి సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయింపుపై కూడా జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు.



సూర్యలంక సముద్రతీరం (ఫైల్‌ఫోటో)

కుల, మతాల మధ్య చిచ్చు పెడుతున్న మోదీ ప్రభుత్వం

● సీ పీ ఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతూ మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మండిపడ్డారు. స్థానిక కొత్తపేటలోని, మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం ఛిద్రం చేస్తున్నా ప్రశ్నించలేని పరిస్థితుల్లో రాష్ట్రంలో పాలక, ప్రతిపక్ష నాయకులు ఉన్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు కార్యాచరణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ జరిగే నిరసనల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, కాబోతు ఈశ్వరరావు, బందెల నాసర్ జీ, జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ఎగుమతులు పెరిగేలా చూడండి

● ప్రభుత్వపరంగా ఏమి సహకారం కావాలన్నా ఇస్తాం

● రైతుకు గిట్టుబాటు ధర లభించడమే అందరి లక్ష్యం కావాలి

● మిర్చి ట్రేడర్ల సమావేశంలో మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా మిర్చి ఎగుమతులు పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ విజయ సునీత మిర్చి ట్రేడర్లను కోరారు. ఎగుమతుల పరంగా ప్రభుత్వం నుంచి ఏమైనా సాయం కావాలన్నా చేస్తామన్నారు. గతంలో ఎలాగైతే రైతులకు మంచి గిట్టుబాటు ధర లభించిందో అలానే ధర వచ్చేలా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గుంటూరులోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో డైరెక్టర్ విజయసునీత మిర్చి ట్రేడర్లతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆలోచనని తెలియజేశారు. గత వారంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ సహాయ శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రస్తుత మిర్చి సీజన్లో రైతులకు గిట్టుబాటు ధర లభించేటట్లు చూడాలని, మిర్చి రైతుల సమస్యలను పరిష్కరించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం స్పందించి రెండు రోజుల క్రితం మార్కెటింగ్, వ్యవసాయం, ఉద్యానవాన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమేరకు శుక్రవారం మార్కెటింగ్ డైరెక్టర్ మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మిర్చి మార్కెట్‌పై సమీక్ష చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.94 లక్షల హెక్టరులలో మిర్చి పంట సాగు చేయగా 11.29 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచన వేయడం జరిగిందన్నారు. గుంటూరు మిర్చియార్డుకు మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ నుంచి రైతులు తమ సరుకులను తీసుకొచ్చే అవకాశం ఉన్నందున మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిర్చి ఎగుమతి వ్యాపారస్తులు వెలగపూడి సాంబశివరావు, తోట రామ కృష్ణ, పొత్తూరి నరేంద్ర, కొత్తూరి సుధాకర్, కర్లపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో రైతులకు లభిస్తున్న ధరలు రాబోయే రోజుల్లోనూ నిలకడగా ఉంటాయన్నారు. గతంతో పోలిస్తే చైనా, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాలకు ఎగుమతులు ఆశాజనకంగా లేవన్నారు. ప్రస్తుతం శీతల గిడ్డంగులలో ఉన్న మిర్చి నిల్వలు ఎగుమతికి అనుకూలంగా లేనందున మార్కెట్లో ధరలు ఆశించిన స్థాయిలో పెరుగుదల లేదన్నారు, అయినప్పటికీ ఫిబ్రవరి 15 తరువాత పంట దిగుబడులు, మిర్చి ఎగుమతులపై ఒక అంచనా వస్తుందని అప్పటి వరకు ప్రస్తుత మిర్చి ధరలు నిలకడగా ఉంటాయని చెప్పారు. శీతల గిడ్డంగులలో 80 లక్షల బస్తాలు నిల్వ సామర్థ్యం ఉన్న దృష్ట్యా ధర తగ్గినా రైతులు వాటిల్లో నిల్వ చేసుకొని బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొంటారని చెప్పారు. సమావేశంలో చివరిలో మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ రైతులకు మార్కెట్లో మిర్చి పంటకు గిట్టుబాటు ధర అందించేందుకు సహకరించవలసినదిగా కోరారు. మిర్చి సీజన్ ప్రారంభమైనందున అధిక సంఖ్యలో మిర్చి బస్తాలు వస్తున్నందున రైతులు, వ్యాపారస్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. యార్డులో ట్రాఫిక్ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి, 15 తరువాత తదుపరి సమావేశం ఏర్పాటు చేసి మిర్చి దిగుబడులు, ధరలను సమీక్షించి తదుపరి కార్యాచరణ చేపడతామని చెప్పారు.



గుంటూరులోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో మిర్చి ట్రేడర్లతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత



ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అభివృద్ధికి కార్యకర్తలు పాటుపడాలి

ఎమ్మెల్యే కొండయ్య పిలుపు

చీరాలటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ కూటమి కార్యకర్తలందరూ పాటుపడాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెంకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 400 కుటుంబాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్య వారికి పార్టీ కండువాలను వేసి స్వాగతించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కక్షలుకార్పణ్యాలకు తావులేకుండా అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. ప్రతి ఒక్కరు గ్రామీణ స్థాయిలో సమన్వయ పరచుకుని పార్టీ సంక్షేమాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. అనంతరం సిద్ది వెంకట బుచ్చేశ్వరరావు, నాదెండ్ల కోటేశ్వరరావు గజమాలతో కొండయ్యను సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.

వాసవీమాతకు పట్టువస్త్రాల సమర్పణ

నల్లగాంధీ బొమ్మ సమీపంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వాసవీమాతకు పట్టువస్త్రాలను సమర్పించారు. అంతకుముందు కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక శివదత్త క్షేత్రంలో గణపతి సచ్చిదానందసామిని ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. స్వామీజీ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా సాహితి



బీజేపీ మండల అధ్యక్షురాలుగా ఎన్నికైన సాహితిని అభినందిస్తున్న నాయకులు

ఇంకొల్లు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలిగా ఇంకొల్లుకు చెందిన కంభంపాటి సాహితి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి యడ్లపాటి స్వరూపారాణి, సహ అధికారి జగన్నాథశాస్త్రి, మండల ఎన్నికల అధికారి ఉలిచి ఏసుబాబు పర్యవేక్షణలో ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన సాహితి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మండవ రామకృష్ణ, వెంకటేశ్వర్లు, నల్లూరి కృష్టయ్య, నాదెండ్ల సారథి, పెనుమాల రామయ్య, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అద్దంకికి జీపు జాతా

అద్దంకిటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న జీపు జాతా శుక్రవారం అద్దంకికి చేరింది. సీపీఎం నాయకులు, కార్యకర్తలు జాతాకు స్వాగతం పలికి పాల్గొన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం పలు కార్య క్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు పంగులూరు మండలం ముప్పవరంలో సామాజిక పెన్షన్ల పంపిణీ, 10 గంటలకు ఒంగోలు లోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు పంగులూరు మండలం ముప్పవరం వద్ద టీడీపీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 3-30 గంటలకు మద్దిపాడు మండలం మల్లవరం సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద జరిగే మీనోత్సవంలో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

చినగంజాం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని తహసీల్దార్ జె.ప్రభాకరరావు అన్నారు. చినగంజాం పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మీకాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి, పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను అమలు చేయడం ద్వారానే సమానత్వం సాధ్యమని అన్నారు. హక్కులతో పాటు సమాజంలోని ప్రతి పౌరుడు తమ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.సుబ్బారావు, ఏపీఎం గద్దె పెద్దసుబ్బారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటకృష్ణారావు గుండెపోటుతో మృతి

ఎమ్మెల్యే ఏలూరి దిగ్భ్రాంతి



వెంకటకృష్ణారావు

పర్చూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పర్చూరు పట్టణపార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు (60) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. టీడీపీలో క్రియాశీలక నాయకునిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న తరుణంలో కూడా పంచాయతీ మెంబర్‌గా పోటీచేసి విజయం సాధించి ప్రజల సమస్యల కోసం ఆయన పనిచేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు అత్యంత సన్నిహితంగా ఉంటూ పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారు. పర్చూరులోని తన నివాసంలో గుండెపోటు రావడంతో హుటాహుటీన సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

భార్య మృతి చెంది నెల గడవకముందే

నెల కిందట సతీమణి అగ్నిగుండాల శ్రీలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. భార్య మృతితో వెంకటకృష్ణారావు మానసిక ఉద్వేకానికి గురయ్యారు. నెల రోజులు గడవకముందే శుక్రవారం వెంకటకృష్ణారావు గుండెపోటుతో మృతిచెందారు. భార్యాభర్తల మృతి స్థానికులతోపాటు పార్టీ శ్రేణులను తీవ్రంగా కలచివేసింది.

వెంకటకృష్ణరావు మృతి పార్టీకి తీరనిలోటు

విధేయుడిని కోల్పోయామని, వెంటకకృష్ణారావు మృతి తనను ఎంతగానో దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య

చీరాలటౌన్ : విఠల్‌నగర్‌కు చెందిన దుంపా ముగతమ్మ (28) ఇంట్లో ఉరివేసుకొని శుక్రవారం రాత్రి మృతి చెందింది. భర్త స్థానిక హోటల్‌లో పనిచేస్తుండగా, ఇద్దరు అబ్బాయిలున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పొగాకు రైతులను వేధిస్తున్న కూలీల కొరత

» భారమవుతున్న పెట్టుబడులు

» ఆందోళనలో సాగుదారులు



పర్చూరు ప్రాంతంలో వైట్‌బర్లీ పొగాకు ఆకులను తాళ్లకు గుచ్చుతున్న కూలీలు



ఉప్పుటూరు సమీపంలో కూలీలు దొరక్క ఎండిపోతున్న పొగాకు

పర్చూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వైట్ బర్లీ సాగుకు ఉమ్మడి ప్రకాశం జిల్లా రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందింది. ఐటీసీ వంటి కంపెనీలు సాగును పోత్సహిస్తూ వస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా దిగుబడితోపాటు, ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో వైట్ బర్లీ సాగు విస్తీర్ణం పర్చూరు ప్రాంతంలో గణనీయంగా పెరిగింది. ఈఏడాది దాదాపు పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాలలో 10వేల హెక్టార్లకు పైగా వైట్‌బర్లీ పొగాకును సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు అంచనావేస్తున్నారు. దీనికి తోడు గత ఏడాధి సాగుచేసుకున్న మిర్చికి తెగుళ్ల సోకడం, అరకొర దిగుబడులు, ధర లేకపోవడం పెట్టు బడులు అధికం కావడంతో అధిక శాతం రైతులు వైట్‌బర్లీ సాగువైపు మొగ్గు చూపారు. దీంతో గతంలో ఎన్నడూలేని విధంగా అంతా వైట్‌బర్లీ పొగాకు మయం అన్నట్లు రైతులు సాగు చేశారు. పెట్టుబడులను కూడా లెక్కచేయని పరిస్థితి. కౌలు పెట్టుబడులను కలుపుకొని ఎకరానికి రూ.లక్షలకు పైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. ఈఏడాది వైట్ బర్లీ పొగాకు విస్తీర్ణంగా భాగా పెరగడం, పంట చేతికి అందే సమయం ఒకేసారి రావడంతో కూలీల కొరత ఏర్పడింది. సకాలంలో కూలీలు దొరక్కపోవడంతో ఆకులు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రూ.300 నుంచి 400లోపు ఉండే కూలీ, ప్రస్తుతం 1000కి పైగా పెరగడం ఇందుకు నిదర్శనం. దీంతో సకాలంలో కూలీలు దొరక్కపోవడం, కళ్లముందే చేతికి వచ్చి పంట ఎండిపోవడంతో రైతులు దిగాలు చెందున్నారు. కూలీల కోసం రైతులు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పొరుగు ప్రాంతాల నుంచి కూలీలను దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని, దీంతో పెట్టుబడులు గణనీయంగా పెరిగిపోతున్నాయని రైతులు అంటున్నారు.

ఏబీసీ ఆయకట్టు పంటలకు నీటి విడుదల

» 18వ మైలు వద్ద 1350 క్యూసెక్కుల ప్రవాహం

» రైతుల హర్షం



ఏబీసీ కాలువ కట్ట అంచులు తగిలేలా ఉధృతంగా వస్తున్న నీరు



33వ మైలు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎన్ఎస్పీ అధికారులు

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో సాగు నీటికి శుక్రవారం పూర్తిస్థాయిలో నీటిని అధికారులు విడుదల చేశారు. ఏబీసీ కాలవ అయకట్టు పరిధిలో ఉన్న దిగువ గ్రామాలలో ఉన్న మెట్ట పంటలకు సాగు నీరు అందించేలా అధికారులు నీటిని విడుదల చేసి కాలపై పర్యటిస్తున్నారు. శుక్రవారం ఉదయంకు 18వ మైలు వద్దకు 1350 క్యూసెక్కుల నీటి విడుదల జరగ్గా మండలం వల్లాపల్లి లాకులు 33వ మైలు వద్దకు 1000 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుంది. దిగువన ఉన్న మార్టూరు, పంగులూరు మండలాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వరి, పొగాకు పంటలకు నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు అధికారులు పెద్ద ఎత్తున నీటిని విడుదల చేయించారు. 33వ మైలు వద్ద నీటి ప్రవాహాన్ని అద్దంకి ఎన్ఎస్పీ డీఈ రామకష్ణ, జేఈ క్రాంతికుమార్ ఏబీసీ పై పర్యటించారు. అన్ని మేజర్లకు నీటిని విడుదల చేయించారు. పంటలకు సకాలంలో నీరు అందించేలా చర్యలు చేపడతామని, సిబ్బందిని కాలవపై నిరంతరం ఉంచుతామని తెలిపారు. రైతులు కూడా నీటిని వృథా చేయవద్దు అని వారు ఈసందర్భంగా కోరారు. ఏబీసీకి పూర్తి స్థాయిలో నీటి విడుదల కావడంతో కాలవ అంచులు తగిలేలా నీటి ప్రవాహం కొనసాగుతుంది.

తప్పులు లేకుండా రీ-సర్వే నిర్వహించాలి



రీసర్వేని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చినగంజాం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రైతులందరూ సర్వేకి హాజరయ్యేట్లు తప్పనిసరిగా నోటీసులు జారీ చేసి, తప్పులు లేకుండా సర్వే సక్రమంగా నిర్వహించాలని చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి టి.చంద్రశేఖర్‌నాయుడు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని మోటుపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వేని క్షేత్రస్థాయిలో శుక్రవారం ఆయన పరిశీలించి, రెవె న్యూ అధికారులకు పలు సూచనలు అందజేశారు. అనంతరం మోటుపల్లి గ్రామ సచివాలయంలో రీసర్వే టీమ్ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ మోటుపల్లి పరిధిలోని వాన్‌పిక్, అటవీ, దేవదాయ శాఖలకు సంబంధించిన భూముల విషయమంలో ఆయా శాఖల అధికారులకు సమాచారం అందజేసి నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ జీవి.ముసలయ్య, రీ సర్వే డీ.టీ కే.సుజాత, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రహదారులకు.. రూ.5,266 కోట్లు

(5వ పేజీ తరువాయి)

మంజూరు చేసింది. అనంతపూర్-గుంటూరు రహదారి విస్తరణలో భాగంగా వినుకొండ నుంచి పేరేచర్ల వరకు ఉన్న రహదారిని నాలుగు వరసలుగా విస్తరిస్తారు. సుమారు 90 కిలోమీటర్ల పొడవునా రహదారిని విస్తరించేందుకు రూ.2,360 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వినుకొండ నుంచి నరసరావుపేట మీదగా రహదారిని విస్తరిస్తారు. రహదారి విస్తరణకు కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. భూసేకరణతో పాటు రహదారి పనులకు ఎన్‌హెచ్ అధికారులు సమాయత్తమవుతున్నారు.

పనులు వేగవంతం.. ప్రారంభం

-దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.312 కోట్లతో 20 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తారు. ఈ పనులకు ఇటీవల మోదీ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. పనులు ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథార్టీ చర్యలు చేపట్టింది.

- దాచేపల్లి మాచర్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారి 167ఏడీగా మార్చారు. రూ.403.22 కోట్లతో పనులు చేపట్టారు. దాచేపల్లి నుంచి గురజాల, రెంటచింతల, పాల్వాయిగేటు మీదగా మాచర్ల వరకు 37 కిలోమీటర్ల పొడవున పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పాల్వాయిగేటు వద్ద రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.

- సత్తెనపల్లి, గురజాల ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లపై బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సత్తెనపల్లి రెడ్డిగూడెం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.57.13 కోట్లు మంజూరు చేసింది. గురజాల నియోజవర్గంలోని తుమ్మలచెరువు - నడికూడి స్టేషన్ల మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.70.49 కోట్లు మంజూరయ్యాయి.

- మాచర్ల నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.117.75 కోట్లు మంజూరు చేసింది. దుర్గి నుంచి వెల్దుర్తి వరకు 17.6 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ.31.60 కోట్లు మంజూరయ్యాయి. 8/6 కిలోమీటరు వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మిస్తారు. రెంటచింతల మండలం పాలువాయి జంక్షన్ నుంచి పసర్లపాడు, జెట్టిపాలెం మీదగా సత్రశాల వరకు 11.2 కిలోమీటర్ల పొడవున రహదారి విస్తరణకు రూ.21.65 కోట్లు మంజూరయ్యాయి. ఈ రహదారిలో 2/4 కిలో మీటరు వద్ద వాగుపై బ్రిడ్జి మంజూరైంది. మాచర్ల నుంచి విజయపూరిసౌత్ వరకు 22.8 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.31 కోట్లు, లోయపల్లి నుంచి గొట్టిపాళ్ల, కండ్లకుంట, గుడిపాటి చెరువు మీదగా లచ్చంబావితండా వరకు 25.40 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.33.50 కోట్లు మంజూరయ్యాయి.

వరాలిచ్చేనా?

వస్తుందని అంచనా వేశారు.

- గుంతకల్లు - గుంటూరు డబ్లింగ్‌కు గత ఏడాది రూ.480 కోట్లు కేటాయించింది. అయితే దిగువమెట్ట వద్ద రిజర్వు ఫారెస్టులో ఇంకా కొన్ని అనుమతులు రావాల్సి ఉండటంతో పనులు జరగడం లేదు. ఈ కారణంగా అదొక బాటిల్ నెక్‌గా మారింది.

- గుంటూరు - బీబీనగర్(248 కిలోమీటర్ల) రైల్వే డబ్లింగ్‌కి గత ఏడాది రూ.220 కోట్ల మూలధనం మంజూరు కావడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇంకా ఎక్కువ మొత్తంలో నిధుల కేటాయింపు జరగాలని రైల్వేవర్గాలు ఆశిస్తున్నాయి. విష్ణుపురం వద్ద బైపాసు లైన్‌కు కూడా నిధుల కేటాయింపు ఎక్కువమొత్తంలో జరగాలని ఆశిస్తున్నారు.

- గుంటూరులో శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి ఇటీవలే రూ.109 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంత మొత్తం కేటాయిస్తారోనన్న ఉత్కంఠ నెలకొన్నది. పలకలూరు రైల్వేగేటు, ఇన్నర్‌రింగురోడ్డు రైల్వేగేటు వద్ద కూడా ఆర్‌వోబీలు మంజూరయ్యాయి. వీటికి కూడా నిధుల కేటాయింపు ఎక్కువమొత్తంలో జరగాలని పలువరు కోరుకుంటున్నారు.

- కేంద్ర ప్రభుత్వ నిధులతో పేరేచర్ల - కొండమోడు నాలుగు వరసల జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్నది. దీనికి ఏమేరకు కేటాయింపులు జరుపుతారోనని అంతా ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

- అనంతపురం - అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకి ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారో, లేదోనన్న అనుమానాలు నెలకొన్నాయి.

- 72 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉన్న బాపట్ల జిల్లాకు పర్యాటకంగా కేంద్రం ఊతమిస్తే ఉపాధి పరంగా వేల సంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుంది. జిల్లా అభివృద్ధికి ఇంధనంగా ఆతిథ్యం రంగం మారే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. తొలి అడుగులో సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.93 కోట్ల కేటాయింపులకు కేంద్రం ఇటీవల పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. ఆ నిధులకు బడ్జెట్‌లో కేటాయింపులపై ఉత్కంఠ నెలకొంది.

- నిజాంపట్నం మండలం దిండి తీరప్రాంతంలో సమీకృత ఆక్వా పార్కు నిర్మాణానికి అదనంగా ఈ బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.

- బాపట్ల జిల్లాలో 22,000 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుంది. ఇక్కడ నుంచి పెద్ద ఎత్తున రొయ్యలు, చేపలు విదేశాలకు ఎగుమతి అవుతాయి. కేంద్రం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఆక్వా రంగానికి రాయతీల వరాల జల్లు కురిపించడంపై రైతాంగం ఆశతో ఉంది. ఆక్వా పార్కు ప్రాజెక్టు నిర్మాణం వ్యయం పెంచడానికి గతంలోనే కేంద్రం ఆమోద తెలిపింది. రూ.90 కోట్ల నుంచి రూ.190కోట్ల వరకు పెంచే ప్రతిపాదనలకు అనుమతిచ్చింది. దీనికి సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయింపుపై కూడా జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు.

వైభవంగా అష్టలక్ష్మి ఆలయ ప్రతిష్ఠోత్సవం

» శ్రీగణపతి సచ్చిదానంద స్వామి, విజయానంద తీర్థ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



ప్రతిష్ఠోత్సవానికి వచ్చిన భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న సచ్చిదానంద స్వామి

పర్చూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో నూతనంగా నిర్మించిన శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీ, దత్త విజయానంద తీర్థ స్వామి హాజరై ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య క్రమానికి నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని చూసి తరించారు. నూతనంగా నిర్మించిన ఆలయాన్ని పచ్చతోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నాలుగు రోజులుగా రుత్వికుల సారథ్యంలో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు జరుగుతున్నాయి. ప్రతిష్ఠ అనంతరం శ్రీ సచ్చిదానంద స్వామి మాట్లాడుతూ ఒకే ప్రాంగణంలో అన్ని దేవతామూర్తులను ఒకే చోట ఏర్పాటు చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఇలాంటి దివ్యక్షేత్రాన్ని సందర్శించుకుంటే అన్ని పుణ్యక్షేత్రాలను సందర్శించుకున్నట్లే అన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి, అమ్మవార్లను ప్రార్థించారు. ఆలయ నిర్మాణంలో భాగం పంచుకున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుం డా ఉండేలా డీఎస్పీ జి.రామాంజనేయు లు, మార్చూరు, సంతమాగులూరు సీఐలు ఎం.శేషగిరిరావు, శ్రీనివాసరావు, ఆరుగులు ఎస్సైలు, 83 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాతకు పూజలు



అద్దంకిలో ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

అద్దంకి, జనవరి31(ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరి అమ్మవారి అగ్ని ప్రవేశ విశ్వరూప దినోత్సవం శు క్రవారం అద్దంకిలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం లో శు క్రవారం వైభవంగా నిర్వహించారు. సు ప్రభాత సేవ, వేదపారాయణం, అఖండ దీపారాధన, పంచామృతాభిషేకము, సుగంధ ద్రవ్యాలతో అభిషేకము నిర్వహించారు. బియ్యం తో అర్చన, వాసవి మూల మం త్ర హోమము నిర్వహించారు. వాసవి మూలమం త్ర హోమము నిర్వహించారు. మహిళా భక్తులచే సామూహిక లలితా సహ స్ర నామ పారాయణము, కుంకుమార్చన జరిగింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో పూజ, హోమము జరిగాయి. దేవస్తానం కమిటీ అధ్యక్షుడు పూటుకూరి రామకోటేశ్వరరావు,కార్యనిర్వహక అధ్యక్షుడు చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, అర్వపల్లి హనుమంతరావు, నేరెళ్ళ శ్రీనివాసరావు, పోకూరి వెంకట శ్రీనివాసరావు ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

అమ్మ వారికి ప్రత్యేక పూజలు

మార్టూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బొడ్డురాయిసెంటరు వద్ద ఉన్న దేవస్థానంలో భక్తులు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత దేవస్థానం నుంచి మహిళలు 108 కలశాలతో ఊరేగింపుగా దేవస్థానానికి వచ్చారు. ఈ కలశాలలోని నీటితో అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేశారు. అదేవిధంగా ఆర్య వైశ్యనాయకులు వెంటరాగా మార్టూరు టౌన్ టీడీపీ నాయకులు కామినేని జనార్దన్ ఊరేగింపుగా దేవస్థానానికి చేరి తాను తీసుకువచ్చిన పట్టు వస్త్రాలను అమ్మవారికి బహూకరించారు. అనంతరం అమ్మవారిని నూతన వస్త్రాలతో అందంగా అలంకరణ చేశారు. కొంత మంది దంపతులు అగ్ని హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు మహిళలతో పాటు గుర్రం శ్రీనివాసరావు, గట్టా యానాదిరావు,సాంబయ్య, వెంకటేశ్వర్లు, కమ్మ శివనాగేశ్వరరావు, నాని, ఆంజనేయులు, వెంకట్రావు పాల్గొన్నారు.

ఎంతటి మహనీయులైనా నాడు విద్యార్థే



జయరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నేడు ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా కూడా వారు ఒకనాటి విద్యార్థి అని వేటపాలెం ఎమ్ఈవోలు సుబ్బయ్య, పురుషోత్తం అన్నారు. శుక్రవారం అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు మాగులూరి జయరావు ఉద్యోగవిరమణ సందర్భంగా జయరావు దంపతులను హెచ్ఎం బద్రిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జయరావు సుమారు 34 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పినట్లు కొనియాడారు. వారి తదుపరి జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంఎల్‌సీ స్టాకు పాయింట్‌ను పరిశీలిస్తున్న జేసీ ప్రఖర్ జైన్

స్టాకు నిర్వహణ పారదర్శకంగా చూడాలి : జేసీ

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రేషన్ స్టాకు డీలర్‌లకు జాగ్రత్తగా చేర్చడమే కాకుండా పారదర్శకంగా ప్రజలకు అందించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. శుక్రవారం వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేటలోని ఎంఎల్‌సీ స్టాకు పాయింట్‌ను జేసీ పరిశీలించారు. అక్కడ రికార్డులను నిశితంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జేసీ వెంట డీఎస్‌వో విలియమ్స్, తహసీల్దార్ గోపీకృష్ణ, సివిల్ సప్లయ్ డీటీ గీత ఉన్నారు.

రెండు నెలల్లోగా రెండు అండర్‌పాస్‌లు

- ఎమ్మెల్యే ఏలూరి కృషితో త్వరలో పనులు ప్రారంభం
- తీరనున్న ప్రయాణికుల కష్టాలు

మార్టూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళ్లే జాతీయరహదారిపై మార్టూరు మండల పరిధిలో మంజూరైన రాజుపాలెం కూడలి వద్ద పెద్ద అండరుపాస్, జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద మినీ అండరుపాస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషితో నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా వారు రాజుపాలెం కూడలి వద్ద (వీయూపీ), జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద (ఎల్వీయూపీ) నిర్మాణానికి రూ.67కోట్లను మంజూరు చేశారు. అందుకు సంబంధించి రెండు అండరుపాస్‌ల నిర్మాణాలవద్ద ఇప్పటికే నేషనల్ హైవే అధికారులు స్థలాలను, రోడ్డును పరిశీలించారు. పనులను ప్రారంభించి తర్వాత వాహనదారులకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలపై హైవేవారు ప్రణాళికను తయారు చేసుకున్నారు. వాటి నిర్మాణాల పరిధిలో చిరువ్యాపారాలు చేసుకుంటున్నవారికి అండరుపాస్ నిర్మాణ పనులు మొదలయ్యేనాటికి వాటిని ఖాళీ చేయాలని తెలిపారు. ఈ విషయమై హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. రెండు అండరుపాస్‌ల నిర్మాణాలకు టెండర్ల దశ కూడా పూర్తయ్యిందన్నారు.సంబంధిత అగ్రిమెంటు తదితర ప్రక్రియలు పూర్తయ్యాయన్నారు.రెండు నెలలు లోపు పనులు ప్రారంభమవుతాయన్నారు.



రాజుపాలెం కూడలి వద్ద అండరుపాస్ లేకపోవడంతో రోడ్డు దాటుతున్న గొర్రెలు, మేకలు (ఫైల్)



కస్తూర్బా బాలికలతో మాట్లాడుతున్న సమగ్ర శిక్షా జీసీడీవో చారులత

నూరు శాతం ఫలితాలు సాధించాలి

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రానున్న పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థినులు కష్టపడి చదవాలని సమగ్ర శిక్షా జీసీడీవో చారులత సూచించారు. శుక్రవారం మండల పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యాలయంలో చదువుతున్న పదోతరగతి, ఇంటర్ విద్యార్థినులతో ఆమె మాట్లాడుతూ బడి మానేసిన విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీ ఫలితాలలో ముందుండాలన్నారు. రానున్న రెండు మాసాలు ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యంతో చదవాలన్నారు. అలానే చదువులో వెనుక బడి ఉన్న వారిని గుర్తించి వారికి ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నూతనంగా నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. ఈ తనిఖీలో ప్రిన్సిపాల్ సరళకుమారి పాల్గొన్నారు.

నిరుపేద యానాదులకు పథకాలను అందించండి

చీరాలటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని అక్కాయిపాలెం పంచాయతీ జేవీకే కాలనీకు చెందిన యానాదులకు సంక్షేమాలు అందజేయాలని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. కాలనీవాసులు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో తహసీల్దార్ పార్వతి సమక్షంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలు వివరించారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే వారికి ఆధార్, రేషన్ కార్డులు అందజేసి పథకాలు చేరేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాలబాలికలకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ



విద్యార్థులకు స్టీల్ వాటర్‌బాటిళ్లను అందజేస్తున్న దాత వెంకటేశ్వర్లు

పంగులూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూజెళ్లపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల బాలబాలికలకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ మద్దినేని వెంకటేశ్వర్లు దివంగత మద్దినేని ఈశ్వరయ్య, అంజమ్మ జ్ఞాపకార్థం రూ.10వేల విలువైన 90 స్టీల్ వాటర్ బాటిల్స్‌ను పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహూకరించి వితరణ చాటారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన స్టీల్ వాటర్ బాటిల్స్ సమకూర్చిన ఆర్టీసీ డ్రైవర్ వెంకటేశ్వర్లును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీరాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాన్యాలకు చట్టబద్ధత కల్పించాలి

మార్టూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రజకులకు కేటాయించిన భూ మాన్యాలను ఆక్రమణల నుంచి తొలగించి, వాటికి చట్టబద్ధత కల్పించాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ రజక సాధికార కమిటీ సభ్యులు పోలూరి సింగయ్య అన్నారు. శుక్రవారం మార్టూరులో రజకవృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింగయ్య మాట్లాడుతూ రజక సంఘం నాయకులు ద్రోణాదుల వెంకటరావు, ద్రోణాదుల సాంబయ్య, శ్రీనివాసరావు, ముక్తిపాటి పర్వతాలు,పాపారావు, గోపి, సీఐటీయూ నాయకులు హనుమంతురావు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో వ్యక్తిపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన కాటూరి పద్మకు సురేష్‌కు స్థలం వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో అతను ఆమె ఇంట్లోకి చొరబడి దాడిచేయడంతో పాటు ఇంటికి తాళాలు వేసినట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య కళాశాలకు వెంకట్రావు మృతదేహం

అద్దంకిటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని 16వ వార్డుకు చెందిన సీపీఎం నాయకుడు గుంజి వెంకట్రావు మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన కుమారులు తన తండ్రి వెంకట్రావు చివరి కోరిక మేరకు మృతదేహాన్ని వైద్య కళాశాలకు అందజేశారు. తమ తండ్రి మరణం తరువాత కూడా ఆయన శరీరాన్ని కళాశాలకు దానం చేయడం వల్ల వైద్య విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వెంకట్రావు మృతేహాన్ని వైద్య కళాశాలకు దానం చేయడంతో ఎందరికో స్ఫూర్తి దాయకమని పలువురు కొనియాడారు. ఒంగోలుకు చెందిన నేత్రదానం, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల ఐక్యవేదిక సభ్యులు అభినందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు మజుందర్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

మహాశివరాత్రి తిరునాళ్లను విజయవంతం చేయాలి

చినగంజాం, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానం 6వ వార్షికోత్సవం, మహాశివరాత్రి తిరునాళ్లను విజయవంతం చేసేందుకు సోపిరాల గ్రామస్థులంతా సహకరించాలని మున్సిపల్ మాజీ చైర్మన్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు అన్నారు. సోపిరాలలో లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం ఆలయ వార్షికోత్సవం, మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 10న అయ్యప్ప స్వామి దేవస్థానం 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానంలో హోమాలు, అభిషేకాలు, పడిపూజ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీఎస్ఆర్.ఆంజనేయులు తెలిపారు. 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా దేవస్థానంలో స్వామి వారికి అభిషేకాలు చేయించే భక్తులకు చిన్న శివలింగం, ప్లేటు, పంచామృతాలతో భక్తులతోనే ఆలయ పూజారి అభిషేకములు చేయించే వినూతన పద్దతని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. తిరునాళ్లలో ఎనిమిది భారీ విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

లక్ష్యాలను అందిపుచ్చుకోవాలి

అద్దంకిటౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు లక్ష్యాను ఎంచుకుని, కష్టపడి చదివి వాటిని అందిపుచ్చుకోవాలని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం బ్యాంక్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ యాక్టివిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా స్థానిక రామ్‌నగర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులకు నోట్ బుక్స్, ప్యాడ్‌లు, పెన్నులు, స్కేల్స్ వంటివి బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ వినోద్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ పల్లెపోగుత వీరాస్వామి, బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బైటమంజులూరులో రికార్డులను పరిశీలిస్తున్న చీరాల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి సుబ్బారావు

రైతుల సమక్షంలో భూ సర్వే చేపట్టాలి

పంగులూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ-సర్వేను భూ యజమానుల సమక్షంలో చేపట్టాలని చీరాల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి కె.సుబ్బారావు అన్నారు. మండలంలోని బైటమంజులూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ పి.సింగారావుతో కలసి పరిశీలించారు. రీ-సర్వే సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సర్వే నిర్వహించే సమయంలో ఆ ప్రాంత రైతులను పిలవాలని, వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని తెలిపారు. వివాదాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా సర్వే ప్రక్రియ కొనసాగించాలన్నారు. గ్రామాలలో చేపట్టే రీ సర్వే కొన్ని తరాల పాటు నిలిచి ఉంటుందని, సిబ్బంది ఎలాంటి అలసత్వం లేకుండా నిజాయితీగా సర్వే చేయాలని తహసీల్దార్ సింగారావు సిబ్బందికి సూచించారు. శుక్రవారం జరిగన కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

చింతల కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి



శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం టీడీపీ నాయకుడు చింతల శ్రీనివాసరావు తండ్రి సుబ్బయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శ్రీనివాసరావు, భార్య జడ్పీటీసీ సభ్యురాలు చింతల అంజలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో మృతి చెందిన జంద్రాజుపల్లి పిచ్చయ్య కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. అదే గ్రామంలో మరో ఇరువురు కుటుంబాలను అయన పరామర్శించారు. కార్యక్రమాలలో మంత్రి వెంట మండల పార్టీ సీనియర్ నాయకులు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, ధూళిపాళ్ల బుల్లిరామయ్య, దద్దాల అంజయ్య, నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, వంకాయల వెంకటరామాంజనేయులు, వెల్లలచెరువు సత్యం ఉన్నారు.

పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు



బాతులు పెంపకం చేస్తున్న వారితో మాట్లాడుతున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చదువుకోవాల్సిన పిల్లలను పనులకు పంపిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రవినాయక్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వల్లాపల్లి గ్రామానికి ఇతర ప్రాంతం నుంచి వలస వచ్చి బాతులు పెంపకం చేస్తూ వారి పిల్లలను బడికి పంపకుండా పనులు చేయిస్తున్న వారికి తహసీల్దార్ కౌన్సిలింగ్ ఇచ్చారు. వలస పనులకు వచ్చిన పిల్లలను అక్కడ ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపాలన్నారు. అలా కాకుండా పనులు చేయిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ వారికి తెలిపారు. కార్యక్రమంలో సర్వే డీటీ ప్రహర్ష, వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పౌరహక్కులతో జీవన మనుగడకు రక్షణ

వేటపాలెం తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పౌరుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వేటపాలెం వేటపాలెం తహసీల్దార్ పార్వతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సర్వోదయ కాలనీలో పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1955 పౌర హక్కుల చట్టం ద్వారా ప్రతిపౌరుడు వారి స్వేచ్ఛ జీవితం గడపవచ్చని చెప్పారు. బలవంతంగా ఇతరుల ప్రలోభాలకు లోనవాల్సిన అవసరం లేదన్నారు. హక్కుల ద్వారా సంక్షేమాలు, ప్రభుత్వం అందించే పథకాలు సాధించవచ్చని సూచించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. తహసీల్దార్ వెంట వీఆర్వో సాల్మన్, గ్రామస్థులు ఉన్నారు.



హక్కులపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ పార్వతి

సాధారణ కౌన్సిల్‌లో పొలిటికల్ హైడ్రామా

- రెండు పార్టీల కౌన్సిలర్‌లు ఢీ అంటే ఢీ
- సభ ఆరంభం నుంచే ఉత్కంఠ
- టీడీపీ కౌన్సిలర్ సత్యానందంను మూడు నెలల సస్పెండ్‌కు వైసీపీ వ్యూహం
- ఎమ్మెల్యే కొండయ్య రాకతో వ్యవహారం తారుమారు



మునిసిపల్ చైర్మన్‌కు డీసెంట్‌ను అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్‌లు



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరిగింది. సభ ప్రారంభం నుంచే పొలిటికల్ హైడ్రామా నడిచింది. ముందుగా వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు మాట్లాడుతూ గత నెలలో జరిగిన సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ సల్లూరి సత్యానందం చైర్మన్ హోదాకు విలువలేదని అన్నారని, రాజ్యాంగ విధివిధానాలకు కట్టుబడి ఎంతో విలువైన స్థానాన్ని అపహాస్యం చేస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు హేయమన్నారు. సభ జరగాలంటే ముందు సత్యానందం క్షమాపణ కోరాలని లేదా అతనని సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సత్యానందం బదులిస్తూ చైర్మన్ హోదాకు ఎక్కడా భంగం కలిగించలేదని అలా జరిగి ఉంటే వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు చెప్పారు. అతనికి టీడీపీ మరో కౌన్సిలర్ సాంబశివరావు మద్దతు పలికారు. దీంతో ఆరంభమైన రగడ హోరాహోరీగా మారింది. వైసీపీ కౌన్సిలర్‌లు గుంటూరు ప్రభాకరరావు, కీర్తి వెంకటరావు, బత్తుల అనిల్‌కు టీడీపీ కౌన్సిలర్‌లు మించాల సాంబశివరావు, సత్యానందం, సూరగాని లక్ష్మి, గోలి స్వాతి తదితరుల మధ్య వాడివేడిగా వాదనలు జరిగాయి. ఒకరిపై ఒకరు ఘాటుగా విమర్శించుకున్నారు. చైర్మన్ జంజనం శ్రీనివాసరావు వైసీపీ కౌన్సిలర్‌లకు అనుకూలంగా మాట్లాడారు. దీంతో టీడీపీ కౌన్సిలర్ సత్యానందంను మూడు మాసాలు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు.

కౌన్సిల్‌లో వాణి వినిపించిన కౌన్సిలర్ లక్ష్మి

అనంతరం అజెండాలోని 27 అంశాలకు గాను రెండు మూడు అంశాలపై అభ్యంతరాలు తెలుపుతూ మిగిలిన వాటిని పాస్ చేయాలని వారికి వారే చెప్పారు. దీంతో 5వ వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మి చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తీరుపై అసహనం చెందారు. వైసీపీ కౌన్సిలర్‌లు మాట్లాడుతున్నప్పుడు వారికి సహకరించి టీడీపీ సభ్యులు మాట్లాడుతున్నప్పుడు మాట్లాడనివ్వడం లేదని మండిపడ్డారు. ఇది పద్ధతి కాదని సభలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేద ప్రజలకు, పూట కూలీలకు నాణ్యమైన ఆహారం అందించే దిశగా అన్న క్యాంటీన్‌లు ప్రారంభిస్తే వాటి ఆధునికీకరణలో భాగంగా వైఫై కనెక్షన్, సీసీ కెమెరా, ఫుడ్ వేయింగ్ మిషన్, డోర్లు విండో గ్లాస్‌లకు అవసరమైన మరమ్మతులకు సంబధించిన అంశాలను రద్దు చేయాలని వైసీపీ కౌన్సిలర్‌లు, చైర్మన్ వ్యవహరించిన తీరు ఘోరమన్నారు. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్యా వాద సాగింది. మిగిలిన అంశాలు పాస్ అంటూ కౌన్సిలర్ ముగించే దశలో ఉండగా ఎమ్మెల్యే కొండయ్య రాకతో వైసీపీ వ్యూహాలు తారుమారయ్యాయి.

అసాధారణమైన సభను ప్రశంతంగా జరిపించండి
- ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ఈవిధమైన వివాదాలు రేగుతుండగా ఎమ్మెల్యే, ఎక్స్ అఫిషియో సభ్యుడు ఎంఎం కొండయ్య రాకతో పరిస్థితులు మారిపోయాయి. సభలో చోటుచేసుకున్న పరిస్థితులను కౌన్సిలర్‌లు ఎమ్మెల్యేకు వివరించారు. ఇది జరుగుతుండగా కొందరు వైసీపీ సభ్యులు వెళ్లిపోయారు. దీంతో మళ్లీ ఎక్స్ అఫిషియో సభ్యులను గౌరవించకపోవడం సభామర్యాద కాదని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విలువైన సమయాన్ని వృథా చేయకూడదన్నారు. ప్రశాతంమైన వాతారణంలో అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించి ఆమోదించాలని తెలిపారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు పట్టంగట్టారని ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇప్పటికే రూ.10కోట్లతో పనులు చేసినట్లు వివరించారు. త్వరలో మరో రూ.2కోట్లు మంజూరవుతున్నట్లు చెప్పారు. ఈసమయంలో సభను సజావుగా నిర్వహించాలన్నారు. తమ కౌన్సిలర్లు బయటకు వెళ్లారంటూ సభను 10 నిమిషాలు వాయిదా వేశారు. తిరిగి సభకు హాజరైన చైర్మన్ సత్యానందం తీరుపై తమకౌన్సిలర్‌లు అసంతృప్తిగా ఉన్నారని సభను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే కొండయ్య వాయిదా వేయడం సమంజసం కాదని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని, అవసరమైతే అవిశ్వాస తీర్మానం ప్రకటిస్తామని హెచ్చరించారు. అయినా కూడా చైర్మన్ సభ నుంచి వెళ్లిపోయారు. దీంతో టీడీపీ కౌన్సిలర్‌లు చైర్మన్‌కు డీసెంట్‌ను అందజేశారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

నిలిచిపోయిన పనులు మార్చి లోపు పూర్తికి చర్యలు

అద్దంకి, జనవరి31(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సమావేశం శుక్రవారం సాదాసీదాగా సాగింది. చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సమావేశం ఉదయం 11-30 గంటలకు ప్రారంభమై అర్థగంట సమయానికే ముగింసింది. అజెండాలోని 34 అంశాలను ఆమోదించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ అద్దంకి పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను మార్చిలోపు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంకా పనులు ప్రారంభించని మూడు రోడ్లకు సంబంధించి గత టెండర్‌లు రద్దు చేసి మరలా టెండర్‌లు పిలవాలని కౌన్సిల్‌లో తీర్మానించారు. ప్రధానంగా కొత్తగా వీధి లైట్లు ఏర్పాటు, మంచినీటి సరఫరా మెరుగు కు అవసరమైన కొత్త మోటార్ లు కొనుగోలు తదితర అంశాలను ఆమోదించారు. ఇళ్ల ప్లాన్‌ల అప్రూవల్‌కు సంబంధించి ప్రభుత్వం సడలింపులు ఇచ్చినందున ప్రజలు వినియోగించుకోవాలని టీపీఎస్ లక్ష్మీ కోరారు. వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్‌లు, మేనేజర్ శ్రీదేవి, ఏఈ లోకేష్ తదితరులు పాల్గొన్నారు. పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు సమావేశానికి గైర్హాజరయ్యారు.



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

పశు ఆరోగ్య శిబిరాలతో పాడి పరిశ్రమ వృద్ధి

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలతో గ్రామాలలో పాడి పరిశ్రమ వృద్ధి చెందుతుందని పశు వైద్యాధికారులు మహేశ్వరరావు, పావనీకుమారి తెలిపారు. మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా గ్రామంలో ఉన్న గేదెలు, దూడలు, గొర్రెలకు మందులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పుమాగులూరి శాంతి, నీటి సంఘం అధ్యక్షుడు కక్కెర సుబ్బారావు, గ్రామ పెద్దలు దేవినేని నరేంద్ర, అమరనేని కాశీయ్య, వినోద్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం లభ్యం

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి సమీపంలో గల జాతీయ రహదారిలో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈమేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గంగమ్మ తల్లికి రెండున్నర కేజీల వెండి తొడుగును అందజేస్తున్న గిరిరాజ్ గ్రానైట్ క్వారీ యజమాని లక్ష్మీనారాయణ దంపతులు

వీర్ల గంగమ్మకు వెండి తొడుగు బహూకరణ

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రసిద్ధి చెందిన వీర్ల గంగమ్మ దేవాలయానికి గిరిరాజ్ గ్రానైట్ క్వారీ యజమాని రావిపూడి లక్ష్మీనారాయణ ప్రమీలాదేవి దంపతులు శుక్రవారం రెండున్నర కేజీల వెండి తొడుగును బహూకరించారు. ఈ మేరకు వెండితొడుగును ఆలయ పూజారికి అందజేశారు. వీర్ల కొండ వద్ద గల గిరిరాజ్ గ్రానైట్ క్వారీ యజమాని లక్ష్మీనారాయణ గంగమ్మతల్లికి రూ.2.50లక్షలు వెచ్చించి అమ్మవారి మూలవిరాట్‌కు తొడుగును తయారు చేయించి అందజేశారు. గతంలో ఆలయంలో చోరీ జరిగి అమ్మవారికి చెందిన వెండి వస్తువులు పోయాయి. దీంతో దేవాలయ పూజారి చల్లగుండ్ల శ్రీనివాసరావు అమ్మవారికి కావాల్సిన వెండి ఆభరణాలగురించి భక్తులకు తెలియజేశారు. దీంతో వెండి తొడుగును అందించారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న గంగమ్మ వార్షిక తిరునాళ్ల సందర్భంగా అమ్మవారు వెండి వస్తువులతో భక్తులకు ప్రత్యేక దర్శనం ఇవ్వనున్నారు.